
సీఎం చంద్రబాబుకు ఎకనామిక్ టైమ్స్ పత్రిక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు ప్రదానం చేయడం నవ్యాంధ్రకు గర్వకారణం.చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం గ్లోబల్ ఇన్వెస్టర్లకు తొలి ప్రాధాన్యతగా మారుతోంది.ఈ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రాష్ట్ర ప్రతిష్ఠను మరింత పెంచింది.కూటమి ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కట్టుబడి పనిచేస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

సోమవారం 27.04.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 5 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



# అంతర్జాతీయ టెక్ మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్

- గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు విశాఖ జిల్లాలో శంకుస్థాపన
- 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి - 1 గిగా వాట్ సామర్థ్యంతో ఏర్పాటు
- ఈ నెల 28న తర్లువాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన
- గూగుల్ రాకతో విశాఖకు విశ్వఖ్యాతి - టెక్ కంపెనీల ఆసక్తి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ టెక్ దిగ్గజం గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో ఏపీలో సరికొత్త టెక్ అధ్యాయం ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 28 తేదీన విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అతిపెద్ద హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో దేశ టెక్నాలజీ రంగంలో ఓ కొత్త చరిత్ర ఆవిష్కృతం కానుంది. ఆసియా ఖండానికే ఓ కీలకమైన ఏఐ గేట్ వేగా విశాఖ అవతరించనుంది. అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో అంతర్జాతీయ టెక్ మ్యాప్ లో విశాఖ నగరం శాశ్వతంగా చోటు సంపాదించనుంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ మెగా డేటా సెంటర్ విశాఖ నగరం ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ నగరాల సరసన చేరనుంది. గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగా 1 గిగావాట్ సామర్థ్యంతో కూడిన ఏఐ డేటా సెంటర్ ను ఏర్పాటు చేస్తోంది. కూటమి ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలు చేస్తుండటంతో గూగుల్ డేటా సెంటర్ సాకారం కానుంది. త్వరలోనే అందుబాటులోకి రానున్న సబ్ సీ కేబుల్ వ్యవస్థ ద్వారా విశాఖ తో వివిధ దేశాలతో నేరుగా అనుసంధానం ఏర్పడనుంది. ఈ డేటా సెంటర్ ద్వారా భారీగా డేటా స్టోరేజితో పాటు ఏఐ క్లౌడ్ ఇన్‌ఫ్రా అందుబాటులోకి రానుంది.

**పోర్టు సిటీ నుంచి డేటా సిటీగా విశాఖ :** విశాఖపట్నం తీర ప్రాంతం కావడంతో అంతర్జాతీయ సముద్రగర్భ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఎంతో అనుకూలం. తర్లువాడ, అడవి వరం, రాంబిల్లి ప్రాంతాల్లో సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో, 1 గిగావాట్ సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టులో అదానీ కనెక్స్, ఎయిర్ టెల్ నెక్స్ ట్రా లాంటి సంస్థలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6.5 గిగా వాట్ల సామర్థ్యంతో మల్టీ-గిగావాట్ డిజిటల్ హబ్‌ను నిర్మించాలనేది ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యం. గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టు కేవలం మౌలిక సదుపాయాల కల్పనకే పరిమితం కాకుండా, భారీగా ఉపాధి అవకాశాలను సృష్టించనుంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ ఆపరేషన్స్, మెయింటెనెన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ ఆర్కిటెక్చర్, డేటా సైంటిస్ట్ వంటి రంగాల్లో వేలాది మంది యువతకు ఉద్యోగ మిగతా 2లో...

## ప్రజలు ఇబ్బంది పడకుండా..
## పెట్రోలు, డీజిల్ సరఫరా పెంచాలి

- వరి కోత యంత్రాలకు డీజిల్ కొరత రానివ్వొద్దు
- ఆయిల్ కంపెనీలు ఉన్నపళంగా పాలసీలు మార్చి ఇబ్బంది పెడితే ఎలా?
- అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పెట్రోల్, డీజిల్ విక్రయాల్లో డిమాండ్‌కి తగిన సప్లయ్ ఉండేలా చూడాలని, సోమవారంలోగా రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను, ఆయిల్ కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడిన సీఎం... రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత తలెత్తడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. రిటైల్ ఔట్ లెట్ల దగ్గర వాణిజ్య వినియోగదారులు కొనుగోళ్లు జరపడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు వివరించారు. రాష్ట్రంలో సాధారణగా పెట్రోల్ రోజుకు 6,330 కేఎల్ అమ్మకాలు జరిగేవని, అయితే శనివారం ఒక్కసారిగా 34 శాతం డిమాండ్ పెరిగి 8,489కేఎల్‌కు అమ్మకాలు చేరాయని, ఆదివారం కూడా సాధారణ డిమాండ్ కన్నా 22 శాతం అధికంగా 7,750 కేఎల్ వినియోగం ఉందన్నారు. మరోవైపు డీజిల్ విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. సాధారణగా డీజిల్ రోజుకు 9,048 కేఎల్ అమ్మకాలు జరిగేవని, అయితే శనివారం ఒక్కసారిగా 16 శాతం డిమాండ్ పెరిగి 10,556 కేఎల్‌కు అమ్మకాలు చేరాయని, ఆదివారం కూడా సాధారణ డిమాండ్ కన్నా 3 శాతం అధికంగా 9,392 కేఎల్ వినియోగం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనికి తోడు నయారా, రిలయన్స్, జియో వంటి ప్రైవేట్ ఆపరేటర్లు కూడా తమ కంపెనీ బంకులకు సప్లయ్ నిలిపివేయడం కూడా సమస్యను మరింత తీవ్రతరం చేశాయని జిల్లా కలెక్టర్లు వివరించారు.

**అనుమతులపై పునరాలోచన చేస్తాం :** మరోవైపు కంపెనీలు రిటైల్ ఔట్ లెట్లకు ఇంతకుముందులా క్రెడిట్ ఇవ్వడం లేదని అధికారులు తెలుపగా, ఎందుకు క్రెడిట్ నిలిపేశారని హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ కంపెనీల ప్రతినిధులను సీఎం ప్రశ్నించారు. కంపెనీలు రిటైల్ ఔట్ లెట్ల మధ్య గ్యాప్ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజలను, ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని చూస్తే అనుమతుల విషయం పునరాలోచన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## సీఎం చంద్రబాబు నాయకత్వంలో
## రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

- చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్' అవార్డుపై హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ ఆలపాటి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ముంబయిలో జరిగిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎకనామిక్ టైమ్స్ పత్రిక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు ప్రదానం చేయడంపై ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఇది నవ్యాంధ్రకు గర్వకారణమని పేర్కొన్నారు.

రాష్ట్ర పరిపాలనలో సాంకేతికత వినియోగం, వ్యాపార అనుకూల వాతావరణం కల్పించడం, పారిశ్రామిక సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేయడంలో ముఖ్యమంత్రి చూపుతున్న దార్శనికతకు ఈ అవార్డు నిదర్శనమని ఆలపాటి అన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను కీలక రాష్ట్రంగా మలచడం, సులభతర వాణిజ్య వ్యవస్థ ఏర్పాటుకు చేపట్టిన చర్యలు విశేష ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గ్లోబల్ ఇన్వెస్టర్లకు తొలి ప్రాధాన్యతగా మారుతోందని, ఈ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందని పేర్కొన్నారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, కూటమి ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. మిగతా 2లో...

## గిరిజనులను భయపెడితే ఊరుకోం

- కొటియా గిరిజనులపై ఒడిశా పోలీసుల దౌర్జన్యం సహించం : మంత్రి సంధ్యారాణి



**సాలూరు(జర్నలిస్ట్ ఫైల్) :** జనగణనకు సహకరించలేదనే నెపంతో పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం ఎగువ సెంబికి చెందిన ఇద్దరు గిరిజనులను ఒడిశా పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని మిగతా 2లో...

## చొరబాటుదారులను తరిమికొడతాం

- బెంగాల్ గడ్డపై అమిత్ షా గర్జన



**నేషలన్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్) :** బంగాల్ రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాడియాలో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా టీఎంసీ, కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. గతంలో బంగాల్‌లో మమతా బెనర్జీ, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలు ఉగ్రవాదుల పట్ల మెతక వైఖరి మిగతా 2లో...

## జన గణనను విజయవంతం చేద్దాం



- పవన శక్తిలో భారత్ నాలుగో స్థానంలో ఉంది
- మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** పవన శక్తి విషయంలో భారత్ మరో మైలురాయిని సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో 56 గిగావాట్లకు పైగా పవన శక్తి ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. గతేడాదితో పోలిస్తే 6 గిగావాట్ల పవన శక్తి అదనంగా ఉత్పత్తి చేస్తున్నామని వెల్లడించారు. పవన శక్తిలో భారత్ నాలుగో స్థానంలో ఉందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే సౌర, పవన శక్తి ముఖ్యమని పేర్కొన్నారు. పునరుత్పాదక విద్యుత్‌తో భవిష్యత్ భద్రంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో పలు విషయాలపై ప్రధాని మోదీ ప్రసంగించారు. బుద్ధ పూర్ణిమ నేపథ్యంలో భారతీయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. 'శాంతి మన లోపలే మొదలవుతుందని భగవాన్ బుద్ధుడు బోధించారు. తనను తాను జయించడమే అన్నిటికంటే గొప్ప విజయమని ఆయన మనకు తెలియజేశారు. మిగతా 2లో...

## తప్పుడు మనుషులు... తప్పుడు రాతలు

- సాక్షి అబద్ధాలపై మంత్రి అచ్చెన్నాయుడు ఘాటు స్పందన
- వైసిపి పాలన వ్యవసాయానికి చీకటి యుగం
- కూటమి ప్రభుత్వం రైతుకు నిజమైన భరోసా



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సాక్షి పత్రికలో వ్యవసాయం పై ప్రచురితమైన వక్రీకృత కథనాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా విరుచుకుపడ్డారు. రైతుల కష్టాలను కావాలనే వక్రీకరించి, ఒకటి రెండు ప్రాంతాల్లో ఉన్న సాధారణ పరిస్థితులను మొత్తం రాష్ట్రానికి వర్తింపజేసి సంక్షోభంలా చిత్రీకరించడం పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో చేసిన కుట్రపూరిత ప్రచారమని ఆయన మండిపడ్డారు. "కూరగాయలు రోడ్లపై పారేస్తున్నారు, రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారు" అంటూ ప్రచారం చేయడం పచ్చి అబద్ధమని, ఇది వైసిపి స్క్రిప్ట్‌ను అమలు చేస్తున్న సాక్షి ప్రయత్నమని ఆయన తేల్చిచెప్పారు. మిగతా 2లో...



## వైట్‌హౌస్‌లో కాల్పుల కలకలం

**వాషింగ్టన్:** వాషింగ్టన్ డిసిలోని హిల్టన్ హోటల్‌లో జరిగిన వైట్‌హౌస్ మీడియా విందు కార్యక్రమంలో ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. కాల్పులు జరిగిన వెంటనే దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియా, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్, విదేశాంగ మంత్రి మార్కొ రుబియోలను అక్కడి నుంచి హుటాహుటిన తరలించారు. ఐదు నుంచి ఎనిమిది రౌండ్ల కాల్పులు జరిగాయని ఘటనా స్థలంలో ఉన్న కొందరు వ్యక్తులు తెలిపారు. ప్రాణభయంతో అతిథులు టేబుల్స్ కింద దాక్కున్నారు. షాట్‌గన్, హ్యాండ్‌గన్‌తో పాటు అనేక కత్తులతో వచ్చిన నిందితుడు భద్రతా వలయాన్ని దాటుకొని లోపలికి ప్రవేశించి హఠాత్తుగా కాల్పులు మొదలు పెట్టాడు. మిగతా 2లో...



## మన్ కీ బాత్‌తో యువతలో చైతన్యం

- బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**రాజానగరం(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 133వ "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలోని ఐఎస్టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులతో కలిసి వీక్షించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడారు.

దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రధాన మంత్రి మోదీ "మన్ కీ బాత్" ద్వారా దేశ ప్రజలతో నేరుగా మమేకమవుతూ స్ఫూర్తిదాయక అంశాలను ముందుకు తీసుకువస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సామాజిక బాధ్యత, స్వచ్ఛత, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు వంటి అంశాలపై యువతలో చైతన్యం పెరుగుతోందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మన్ కీ బాత్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా వినడం ద్వారా దేశంలో జరుగుతున్న సానుకూల మార్పులను తెలుసుకోవచ్చని చెప్పారు. ప్రతి యువతి తమలోని ప్రతిభను వెలికితీసి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. మిగతా 2లో...

## అంతర్జాతీయ టెక్ మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్



(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలు లభిస్తాయి. డేటా సెంటర్ల ద్వారా వచ్చే ఆదాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేయనుంది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో రాష్ట్రంలో అనుబంధ రంగాల నుంచి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. పవర్ సిస్టమ్స్, కూలింగ్ టెక్నాలజీ, సర్వర్ తయారీ, నెట్‌వర్కింగ్ వంటి రంగాల్లో స్థానికంగా మాన్యుఫాక్చరింగ్ యూనిట్లతో ఏఐ ఏకోసిస్టమ్ ఏర్పాటు కానుంది.

**విశాఖకు అంతర్జాతీయ హంగులు :** గూగుల్ ఏఐ క్లౌడ్ సేవల ద్వారా విశాఖ ఆసియాలోనే ప్రధాన కేంద్రంగా మారే అవకాశం మారనుంది. దీంతో పాటు ఏఐ ఆధారిత కంపెనీలకు కూడా విశాఖ గమ్య స్థానంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఏఐ ఎకోసిస్టమ్ తో ఐటీ స్టార్టప్ లు, రీసెర్చ్ సెంటర్లు క్లౌడ్, సెమీ కండక్టర్ కంపెనీలు విశాఖకు క్యూ కట్టే అవకాశముంది.. గూగుల్ సహా ఇతర టెక్ కంపెనీలు ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ల కోసం గ్రీన్ ఎనర్జీని సరఫరా చేసేందుకు వీలుగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రముఖ టెక్ సంస్థలన్నీ విశాఖ వైపు చూస్తుండటంతో ఇప్పుడు నగరానికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం లాంటి అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయలు కూడా త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. వికసిత్ భారత్ 2047 విజన్ కు అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గ్లోబల్ టెక్ కేంద్రంగా మార్చే క్రమంలో గూగుల్ పెద్ద ముందడుగు కానుంది.

## సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రికి దక్కిన ఈ అరుదైన గౌరవం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందనలు తెలిపారు.

## ప్రజలు ఇబ్బంది పడకుండా..
## పెట్రోల్, డీజిల్ సరఫరా పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయిల్ కంపెనీల అసంబద్ధ నిర్ణయాల కారణంగా ప్రజలు ఇబ్బందిపడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజల నిత్యావసరాలకు సంబంధించిన అంశంలో బాధ్యత లేకుండా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఆయిల్ కంపెనీలకు తేల్చిచెప్పారు. గురువారమే సమస్యను గుర్తించామని అధికారులు చెప్పగా... మూడు రోజుల క్రితమే సమస్య గుర్తించినప్పుడు ఎందుకు పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోలేదని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య తలెత్తిన తరువాత, ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో తనకు నివేదికలు ఇవ్వడం కాదని... ఫలితాలు చూపించాలని సిఎం స్పష్టం చేశారు.

**రైతులకు కూపన్ విధానం పరిశీలించండి :** మరోవైపు మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు రెవెన్యూ, పోలీస్, లీగల్ మెట్రాలజీ విభాగాలతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ఒక్కసారిగా సమస్య తలెత్తడంపై విచారణ జరపాలని చెప్పారు. అగ్రి, ఆక్వాకల్చర్ అవసరాలు కూడా పెరిగాయని... వరికోత యంత్రాలకు డీజిల్ కొరత రానివ్వొద్దని స్పష్టం చేశారు. రైతులకు కూపన్ విధానం ప్రవేశ పెట్టే ఆలోచన కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు చేయాలని సూచించారు. ప్రతీ బంక్ దగ్గర రెవెన్యూ, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడమే కాకుండా, సీసీ కెమేరాల ద్వారా పర్యవేక్షణ జరపాలన్నారు. ఎక్కడా బ్లాక్‌లో అమ్మకాలు జరగకూడదని చెప్పారు. సోమవారం నాటికి ఎక్కడా నో స్టాక్ బోర్డులు కనిపించకూడదని చెప్పారు.

## చొరబాటుదారులను తరిమికొడతాం



(మొదటి పేజీ తరువాయి)

అవలంబించాయని ఆరోపించారు. కానీ 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి సర్జికల్, ఎయిర్ స్ట్రైక్స్ లాంటి చర్యలతో ఉగ్రదాడులకు నిర్ణయాత్మకమైన సమాధానం ఇచ్చిందని అన్నారు.

**చొరబాటుదారులను బహిష్కరిస్తాం! :** బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అక్రమ చొరబాటుదారులను గుర్తించి, వారిని బహిష్కరిస్తామని అమిత్ షా పేర్కొన్నారు.

టీఎంసీని తుడిచిపెట్టేశారు!

నాడియా జిల్లాలోని టెహట్టాలో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా, మమతా బెనర్జీ సర్కార్‌పై విమర్శల జల్లు కురిపించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలోనే ఓటర్లు మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని తుడిచి పెట్టేశారని వ్యాఖ్యానించారు. ఏప్రిల్? 23న జరిగిన మొదటి దశ ఎన్నికల్లోనే బీజేపీ 110 సీట్లను గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

'బంగాల్ బాధ్యతలు బీజేపీ చేపడితే ఇక్కడ కొనసాగుతున్న గూండా రాజ్యం, సిండికేట్ రాజ్‌లకు ముగింపు లభిస్తుంది. ఓటు వేసేందుకు బయటకు రావడానికి ఎవరూ భయపడకండి. ఎన్నికల సంఘం తగిన ఏర్పాట్లు చేసింది. మిమ్మల్ని ఓటు వేయకుండా ఆపడం ఎవరి వల్లా కాదు' అని అమిత్ షా ఓటర్లకు పిలుపునిచ్చారు. అయితే ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరైనప్పటికీ, అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో, అమిత్ షా తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించాల్సి వచ్చింది.

సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరైనప్పటికీ, అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షం కారణంగా ఈ సీనియర్ బీజేపీ నేత తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించాల్సి వచ్చింది

**గూండాల పనిపడతాం! :** అంతకు ముందు, అంటే శనివారం టోలీగంజ్‌లో అమిత్ షా భారీ రోడ్ షో నిర్వహించారు. ఆ సందర్భంగా బంగాల్ ఎన్నికల సమయంలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నిస్తే, టీఎంసీ గూండాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హెచ్చరించారు. "నేను ఇప్పుడు గూండాలకు హెచ్చరిస్తున్నా. ఏప్రిల్ 29న మీ ఇళ్ల నుంచి బయటకు రావద్దు. లేకపోతే మే 5వ తేదీ తర్వాత మీపై కనికరం ఉండదు. ఏప్రిల్ 29న ఉదయం 7 గంటలకు తల్లులు, సోదరీమణులు, యువకులు అందరూ పోలింగ్ బూత్‌లకు చేరుకుని కమలం గుర్తుపై బటన్ నొక్కాలని నేను కోరుతున్నాను" అని అన్నారు.

కాగా, ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం, గురువారం ముగిసిన మొదటి దశ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా 91.78 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక రెండో దశ పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుండగా, ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

# తప్పుడు మనుషులు... తప్పుడు రాతలు

(మొదటి పేజీ తరువాయి)

2019 నుంచి 2024 వరకు వైసిపి ప్రభుత్వం వ్యవసాయ శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, రైతులకు సరైన మద్దతు ధరలు కల్పించకపోవడం, మార్కెట్‌లో సమయానికి జోక్యం చేసుకోకపోవడం, ఇన్‌పుట్ సబ్సిడీల్లో తీవ్ర ఆలస్యం చేయడం వల్లే అప్పట్లో నిజంగా రైతులు పంటలు రోడ్లపై పారేయాల్సిన దుస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. రైతు సంక్షేమం పేరుతో పెద్దఎత్తున ప్రచారం చేసిన జగన్, రైతు జీవితంలో ఒక్క శాశ్వత మార్పు కూడా తీసుకురాలేకపోయారని, ఇప్పుడు అదే వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సాక్షి ద్వారా అబద్ధాల ప్రచారం చేయిస్తున్నారని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతుకు లాభదాయకమైన వ్యవసాయం అందించేందుకు మార్కెట్ వ్యవస్థను బలోపేతం చేస్తూ, నిల్వ సదుపాయాలు, రవాణా, ధరల స్థిరీకరణ చర్యలు సమగ్రంగా అమలు చేస్తోందని, ఆ ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. వాస్తవాలను ఎదుర్కొనే ధైర్యం లేని వారు మాత్రమే అబద్ధాల వెనుక దాక్కుంటారని, సాక్షి పత్రిక అబద్ధాల యంత్రంగా మారిందని తీవ్రంగా విమర్శిస్తూ, వెంటనే ఈ తప్పుడు ప్రచారం ఆపకపోతే రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలకు ప్రజలే తగిన సమాధానం ఇస్తారని మంత్రి అచ్చెన్నాయుడు ఘాటుగా హెచ్చరించారు.

రాష్ట్రంలో కూరగాయలు, పండ్ల ధరలపై "సాక్షి" పత్రిక అదే పాత, అసత్య సమాచారాన్ని పునరావృతంగా ప్రచురిస్తూ రైతులను, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉల్లి, టమోటా, అరటి, బొప్పాయి పంటలు రబీ సీజన్ ముగింపు దశలో ఉండి కోతలు దాదాపు పూర్తయ్యాయని, ఉల్లిపాయలో



3740 హెక్టార్లలో సాగు జరగగా 97 శాతం కోత పూర్తై సుమారు 3500 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉండి ప్రస్తుతం కిలోకు రూ. 5.80 ధర ఉండగా, టమోటాలో 12,676 హెక్టార్లలో సాగు జరిగి 8,500 హెక్టార్లలో కోత పూర్తై మిగతా ప్రాంతాల్లో కొనసాగుతూ మొత్తం 54,290 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉండి ప్రస్తుతం కిలోకు రూ. 15 నుంచి రూ. 21 వరకు ధరలు నమోదవుతున్నాయని తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి మార్కెట్ కమిటీలో 26-04-2026 నాటికి 276 మెట్రిక్ టన్నుల టమోటా రాగా మంచి నాణ్యతకు రూ. 32-36, మధ్యస్థానికి రూ. 27-31, సాధారణ నాణ్యతకు రూ. 20-26 ధరలు ఉండగా, పుంగనూరు మార్కెట్‌లో 10 కేజీలకు గరిష్ఠంగా రూ. 360, కనిష్ఠంగా రూ. 214, మోడల్ ధర రూ. 287గా ఉండి మొత్తం 390.10 మెట్రిక్ టన్నుల సరుకు వచ్చినట్లు పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో అరటి పండ్లకు ఇప్పటివరకు 85,326 నుంచి 90,210 మెట్రిక్ టన్నుల ఎగుమతులు జరగగా, యుద్ధానికి ముందు టన్నుకు రూ. 20,000 నుంచి రూ. 23,000 ధరలు ఉండగా ప్రస్తుతం ఫార్మ్ గేట్ వద్దఏ గ్రేడ్ రూ. 8-10/కిలో, బీ గ్రేడ్ రూ. 6-8/కిలో, జ గ్రేడ్ రూ. 4-5/కిలో ధరలు కొనసాగుతున్నాయని, ఇంకా 93 హెక్టార్లలో కోత మిగిలి ఉండి సుమారు 1,382 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అందుబాటులో ఉందని తెలిపారు. బొప్పాయి పంటలో ఇంకా 48 హెక్టార్లలో కోత మిగిలి ఉండి సుమారు 3,210 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి ఉండగా ప్రస్తుతం 1వ రకం రూ. 7-8, 2వ రకం రూ. 6-7, 3వ రకం రూ. 5-6 కిలో ధరలు కొనసాగుతున్నాయని చెప్పారు. కడప జిల్లాలో అరటి పంటలో ఇంకా 1,170 హెక్టార్లలో కోత మిగిలి ఉండగా బంచ్ కట్టింగ్‌కు టన్నుకు రూ. 8,000 నుంచి రూ. 11,000, హ్యాండ్స్ కట్టింగ్ ఉ బాక్సింగ్‌కు టన్నుకు రూ. 12,000 నుంచి రూ. 14,000 వరకు ధరలు లభిస్తున్నాయని తెలిపారు. మొత్తం పరిస్థితిని పరిశీలిస్తే ఎక్కువ పంటలు ముగింపు దశలో ఉండటం వల్ల నాణ్యతలో మార్పులు, సరఫరాలో హెచ్చుతగ్గులు సహజమని, గతంలో తక్కువ నాణ్యత, సీజనల్ ఫ్లక్చుయేషన్స్ సమయంలో నమోదైన ధరలను ఇప్పటికీ ఉన్నట్లుగా చూపించడం పూర్తిగా తప్పుదారి పట్టించే చర్య అని మంత్రి అన్నారు. ముఖ్యంగా టమోటా ధరలు ప్రస్తుతం మంచి స్థాయిలో ఉండి సాగు వ్యయంతో పోలిస్తే రైతులకు లాభదాయకంగానే ఉన్నాయని స్పష్టం చేస్తూ రైతుల్లో భయాందోళనలు సృష్టించే తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని మంత్రి అచ్చెన్నాయుడు గారు సూచించారు, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. కొంతమంది దళారులు కావాలనే తప్పుడు సంకేతాలు సృష్టిస్తూ పలు పత్రికల్లో తమకు అనుకూలమైన వార్తలు రాయించుకుంటున్నారని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రైతుల వద్ద తక్కువ ధరకు మొక్కజొన్న, జొన్న కొనుగోలు చేసిన దళారులే కొద్ది రోజుల్లో మీఎస్పీ రేటుకే వాటిని అమ్ముకునే పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు.

22-04-2026 నాటికి ఉన్న అధికారిక గణాంకాల ప్రకారం కనీస మద్దతు ధరల (మీఎస్పీ) కంటే మార్కెట్ ధరలు ఎక్కువగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. వరి గ్రేడ్-ఎకు మార్కెట్ ధర రూ. 2500, వరి కామన్‌కు రూ. 2400గా నమోదయ్యాయి. జొన్న (హైబ్రిడ్)కు 1900-1950, జొన్న మాల్దాండి రూ. 5500, రూ. 5875 (ఏపీ మార్క్‌ఫెడ్), పత్తి రూ. 8689-9072, మీడియంకు, రూ. 6500-6700గా నమోదయ్యాయి. పసుపుకు రూ. 11600-11750, మిర్చికి రూ. 13500-22800 (కామన్), రూ. 13500-22500 (స్పెషల్), రూ. 7500-11800 (తెల్ల)గా ఉన్నాయి. ఉల్లిపాయకు రూ. 1300, నిమ్మకాయలు ఏలూరు రూ. 7500-11500-16000, తెనాలి రూ. 8000-10000-12500, పొదలకూరు రూ. 10000-14000-17000గా ఉన్నాయి. కొబ్బరికాయలో కాప్రా రూ. 15500-16500, డ్రై కొబ్బరి రూ. 28000-30000, గటగటా రూ. 23000-25000, వాటర్ కొబ్బరి రూ. 15000-17000గా నమోదయ్యాయి. ఈ గణాంకాలన్నింటిని పరిశీలిస్తే రైతులకు మీఎస్పీ కంటే మెరుగైన ధరలు లభిస్తున్నాయని స్పష్టంగా తెలుస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు గారు తెలిపారు.

# వైట్‌హౌస్‌లో కాల్పుల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

భద్రతా సిబ్బంది అధ్యక్షుడు ట్రంప్‌ను హుటాహుటిన అక్కడి నుండి తరలించే క్రమంలో ఆయన కిందపడిపోయారు. వెంటనే తేరుకున్న సిబ్బంది ట్రంప్‌ను బాల్ రూమ్‌కు తీసుకుపోయారు. ఘటన అనంతరం ట్రంప్ సోషల్ ట్రూత్‌లో స్పందిస్తూ 'షో కొనసాగాలి' అని వ్యాఖ్యానించారు. కాల్పుల సమయంలో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు వేగంగా, ధైర్యంగా స్పందించారని ఆయన ప్రశంసించారు. కాల్పులకు పాల్పడిన నిందితుడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారని, తదుపరి చర్యల విషయంలో పూర్తిగా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్ణయాలకే లోబడి ఉంటామని ఆయన స్పష్టం చేశారు. తామంతా క్షేమంగా ఉన్నామని ట్రంప్ చెప్పారు. ఇరాన్‌పై జరుపుతున్న యుద్ధానికి, ఈ దాడికి సంబంధం ఉన్నదని తాను అనుకోవడం లేదని అన్నారు. అయితే ఏదీ చెప్పలేమని వ్యాఖ్యానించారు. భద్రతా కారణాల రీత్యా ఈవెంట్‌ను అధికారులు రద్దు చేశారు. ఘటన జరిగిన కొద్ది నిమిషాల్లోనే భద్రతా బలగాలు మొత్తం ప్రాంతాన్ని తమ అదుపులోకి తీసుకుని హోటల్‌ను ఖాళీ చేయించాయి. ఘటన సమయంలో ప్రముఖ జర్నలిస్టులు, రాజకీయ నాయకులు ట్రంప్ ప్రసంగం కోసం వేచి ఉన్నారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది కాల్పులకు పాల్పడిన అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనతో అమెరికాలో భద్రతా వ్యవస్థలపై మరోసారి చర్చ మొదలైంది. ఇంత భారీ భద్రత ఉన్న కార్యక్రమంలో కాల్పులు జరగడం ఆందోళన కలిగించే విషయమని ప్రత్యక్షసాక్షులు పేర్కొన్నారు.

**నిందితుడు ఎవరు? :** కాల్పులు జరిపిన నిందితుడు 31 ఏళ్ల లాస్ ఏంజిల్స్ దిగ్రాంత్ ప్రాంతానికి చెందిన కోల్ టోమస్ అలెన్‌గా గుర్తించారు. అతను కాలిఫోర్నియాలో ట్యూటర్‌గా పనిచేస్తున్నాడు. కోల్ టోమస్ కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఉన్నత విద్యావంతుడు. కాల్పులు జరిపిన అనంతరం వాషింగ్టన్ హిల్టన్‌లో, పోలీసులు ఒక గదిని స్వాధీనం చేసుకున్నారని మెట్రోపాలిటన్ పోలీస్ డిపార్ట్‌మెంట్ తాత్కాలిక చీఫ్ జెఫరీ కారోల్ తెలిపారు. అనుమానితుడి వద్ద షాట్‌గన్, హ్యాండ్‌గన్, పలు కత్తులు ఉన్నాయని, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అతన్ని అదుపులోకి తీసుకుందని పోలీసు అధికారులు తెలిపారు.

**ప్రత్యక్షసాక్షి కథనం ప్రకారం.. :** నిందితుడు హోటల్‌లోనే ఆయుధాన్ని సిద్ధం చేసుకున్నాడని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. శీతల పానీయాలు ఉంచే గది సమీపంలో పెద్దగా భద్రతా ఏర్పాట్లు ఉండవని తెలుసుకున్న నిందితుడు కోల్ టామోస్ అలెన్ అక్కడే దాక్కున్నాడని, ఓ బ్యాగు నుంచి



పొడవైన తుపాకీని బయటికి తీశాడని, ఆ తర్వాత ఆకస్మికంగా విందు జరుగుతున్న బాల్ రూమ్ వైపు ఆ తుపాకీ పట్టుకొని పరుగులు తీశాడని వివరించారు. ఆ వెంటనే విచక్షణా రహితంగా అన్ని వైపులా కాల్పులు జరిపాడని తెలిపారు. దీంతో అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, భద్రతా దళాలు అతనిని పట్టుకునేందుకు పరుగులు తీశారు.

**ట్రంప్‌పై హత్యాయత్నాలు.. :** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై అనేక హత్యాయత్నాలు జరిగాయి. జులై 2024లో పెన్సిల్వేనియా బట్లర్‌లో జరిగిన ఒక ర్యాలీలో ట్రంప్ వేదికపై మాట్లాడుతుండగా, ఒక దుండగుడు సమీపంలోని భవనం పైకప్పుపై నుండి కాల్పులు జరిపాడు. ఈ దాడిలో అక్కడే ఉన్న ఒక వ్యక్తి మరణించగా, ట్రంప్ చెవికి గాయమైంది. పోలీసులు సంఘటనా స్థలంలోనే అనుమానితుడు 20 ఏళ్ల థామస్ క్రూక్స్‌ను కాల్చి చంపారు. అదే సంవత్సరం సెప్టెంబరులో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా కాల్పులు జరిపేందుకు ప్రయత్నించిన వ్యక్తిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ గుర్తించడంతో, అతడిని వెంటనే అరెస్టు చేశారు. ఫిబ్రవరిలో షాట్‌గన్‌తో ఫ్లోరిడాలోని ట్రంప్ మార్-ఎ-లాగో రిసార్ట్‌లోకి ప్రవేశించిన ఆస్టిన్ టక్కర్ మార్టిన్ అనే 21 ఏళ్ల యువకున్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**మోడీ సహా పలువురు ప్రముఖుల ఖండన :** ట్రంప్‌పై హత్యాయత్నాన్ని పలు దేశాల నాయకులు ఖండించారు. ప్రధాని నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ఈ దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని, ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని పేర్కొన్నారు. వారు సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు. ట్రంప్ దంపతులు సురక్షితంగా ఉండటంపై కెనడా ప్రధాని మార్క్ కార్నీ సంతోషం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్.. అమెరికా భద్రతా సిబ్బంది విధులు చిత్తశుద్ధితో నిర్వహించారన్నారు. యూరోపియన్ యూనియన్ దౌత్యవేత్త కజా కల్లాస్.. రాజకీయ హింసకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదన్నారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తీవ్రంగా ఖండించారు. హింస దేనికీ మార్గం కాదని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ అన్నారు. శాంతి విలువలను సమర్థించే ప్రజలకు హింస ఎన్నటికీ మార్గం కాదని వెనిజులా అధ్యక్షురాలు రోడ్రిగుయెజ్ చెప్పారు. అమెరికాలో పార్టీలకు అతీతంగా చట్టసభ సభ్యులందరూ దాడిని ఖండించారు. పాకిస్తాన్‌సహా పలు దేశాలు దాడిని ఖండించాయి.

**వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ అంటే ? :** వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ అనేది వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ (డబ్ల్యూ హెచ్‌సిఎ) ఇది పాత్రికేయులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, ముఖ్యులను ఒకచోట చేర్చే ఒక ప్రధాన సామాజిక సమావేశం. ఇది 1921లో ప్రారంభించారు. పత్రికా రంగానికి, అధ్యక్షుడికి మధ్య వారధిగా పనిచేయడానికి 1914లో ఈ సంఘం ఏర్పడింది. ఈ విందు, డబ్ల్యూహెచ్‌సిఎ తన కార్యకలాపాలకు నిధులు సమకూర్చుకోవడానికి, అధ్యక్షుడి వార్తలను కవర్ చేసే జర్నలిస్టులకు మద్దతు ఇవ్వడానికి, జర్నలిజం విద్యార్థులుగా ఎదగాలనుకునే వారికి స్కాలర్‌షిప్‌లు అందించడానికి నిధులను సేకరించడానికి ఏర్పాటు చేసే కార్యక్రమం. ప్రతియేటా జరిగే ఈ కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు, ప్రథమ మహిళతో పాటు ఉన్నత పరిపాలనా అధికారులు, దౌత్యవేత్తలు, మీడియా ప్రముఖులు పాల్గొంటారు.

**ఇదే హోటల్‌లో రోనాల్డ్ రీగన్ పై హత్యాయత్నం.. :** 1981 మార్చి 30న అప్పటి దేశాధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై ఇదే హోటల్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొటానికి వచ్చినప్పుడు జాన్ హింక్లీ ఆరు రౌండ్ల కాల్పులు జరిపాడు. ఆయన ఛాతిలోకి బుల్లెట్ దూసుకుపోయింది. రోనాల్డ్ రీగన్‌తో పాటు ఉన్న మీడియా కార్యదర్శి జేమ్స్ బ్రాడీ, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సకాలంలో చికిత్స అందటంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. జాన్ హింక్లీని విచారించిన కోర్టు అతని మానసిక పరిస్థితి సరిగ్గా లేదని జైలు నుండి విడుదల చేయడం గమనార్హం.

## సామాన్యులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందాలి: మంత్రి కందుల దుర్గేష్

- **రాజమహేంద్రవరంలో శ్రీ రమేష్ కిడ్నీ హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్**
- **పేద ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ పరమావధి: మంత్రి కందుల దుర్గేష్**



**రాజమహేంద్రవరం, (జర్నలిస్ట్ ఫైల్) :** రాజమహేంద్రవరం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పాత సోమలమ్మ అమ్మవారి ఆలయం వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన "శ్రీ రమేష్ కిడ్నీ హాస్పిటల్"ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లోని వివిధ విభాగాలను మంత్రి సందర్శించారు. అత్యాధునిక వైద్య పరికరాలను, మిషనరీని పరిశీలించిన ఆయన వాటి పనితీరు గురించి అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ పెరుగుతున్న ఆరోగ్య సమస్యల దృష్ట్యా, కిడ్నీ సంబంధిత వ్యాధులకు మెరుగైన చికిత్స సామాన్య ప్రజలకు సైతం అందుబాటులోకి రావాలని మంత్రి ఆకాంక్షించారు. వైద్యం కేవలం ధనికులకు మాత్రమే పరిమితం కాకుండా, పేద ప్రజల ఆరోగ్యమే పరమావధిగా వైద్యులు పని చేయాలని మంత్రి సూచించారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి, రోగులకు చిరునవ్వుతో వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ యాజమాన్యాన్ని మరియు సిబ్బందిని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వైద్య నిపుణులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మన్ కీ బాత్‌తో యువతలో చైతన్యం



(మొదటి పేజీ తరువాయి)

దేశ అభివృద్ధికి ప్రతి పౌరుడు భాగస్వామి కావాలనే లక్ష్యంతో మోదీ తీసుకొస్తున్న కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న సాలిగ్రామ, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గిరిజనులను భయపెడితే ఊరుకోం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి ఖండించారు. ఎపి పరిధిలోకి వచ్చి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేయడం ఒడిశా పోలీసుల అత్యుత్సాహానికి నిదర్శనమని ఆమె విమర్శించారు. గిరిజనులను అన్యాయంగా అరెస్ట్ చేస్తే సహించేది లేదన్నారు. గిరిజనులకు ఇష్టం లేకపోయినా వారిని బలవంతంగా ఒడిశా ఓటర్లుగా ఎందుకు చేర్చాలనుకుంటున్నారని నిలదీశారు. కొటియా గ్రామాల్లో నెలకొన్న తాజా ఉద్రిక్త పరిస్థితులను, ఒడిశా అధికారుల ఏకపక్ష ధోరణిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సరిహద్దుల్లోని గిరిజనుల హక్కులను కాపాడే విషయంలో ఎపి ప్రభుత్వం ముందుంటుందన్నారు. సరిహద్దు గ్రామాల ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఒడిశా పోలీసుల దౌర్జన్యాలపై ఉన్నతాధికారులతో చర్చించి, గిరిజనులకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## జన గణనను విజయవంతం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న ఉద్రిక్తతలు, సంఘర్షణల మధ్య.. బుద్ధుని బోధనలు ఎంతో ముఖ్యమైనవిగా మారాయి. ప్రపంచం బుద్ధుని బోధనలను అనుసరించాలి' అని అన్నారు.

జన గణన గురించి మోదీ మాట్లాడుతూ.. 'జన గణన కేవలం ప్రభుత్వ పని మాత్రమే కాదు. ఇది మనందరి బాధ్యత. జన గణనలో మీ భాగస్వామ్యం ఎంతో కీలకం. మీరు ఇచ్చే సమాచారం పూర్తిగా సురక్షితం, గోప్యంగా ఉంచబడుతుంది. జన గణన 2027ని విజయవంతం చేద్దాం' అని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

న్యూక్లియర్ సైంటిస్టుల గురించి మోదీ మాట్లాడుతూ.. 'మన న్యూక్లియర్ సైంటిస్టులు ఒక గొప్ప విజయం ద్వారా భారతదేశానికి గర్వకారణంగా నిలిచారు. తమిళనాడులోని కల్పక్కంలో ఉన్న ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ 'క్రిటికాలిటీ'ని సాధించింది. ఇండియన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్ కోసం కృషి చేసిన వారందరికీ అభినందనలు తెలియజేస్తున్నా' అని ఆయన అన్నారు.

## బస్సులో పేలుడు..13 మంది మృతి



**బొగొటా :** నైరుతి కొలంబియాలో బస్సులో పేలుడు సంభవించి 13 మంది మృతి చెందారు. 38 మంది గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం ఉదయం జరిగింది. ఆ దేశ ఆర్మీ చీఫ్ దీన్ని ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. ఈ ఘటన జరిగిన ప్రాంతంలో అక్రమ మాదక ద్రవ్యాల రవాణా జరుగుతుందని ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ట్రావెల్ బస్సులో పేలుడు పరికరం పేలడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై కాకా ప్రాంత గవర్నర్ ఆక్టావియో గుజ్మాన్ స్పందించారు. కాజిబియో మునిసిపాలిటీలోని పాన్ అమెరికన్ హైవేపై బస్సు ప్రయాణిస్తుండగా ఆ పరికరం పేలిందని గుజ్మాన్ మీడియాకు వెల్లడించారు. గాయపడిన వారిలో ఐదుగురు చిన్నారులు ఉన్నారని కాకా ఆరోగ్య కార్యదర్శి కరోలినా కామార్గో.. నోటిసియాస్ కారకోల్ అనే టీవీ ఛానెల్ కు తెలిపారు.

ఈ ఘటనపై కొలంబియా సాయుధ దళాల కమాండర్ జనరల్ హ్యూగో లోపెజ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'ఇది ఒక "ఉగ్రవాద చర్య". కొలంబియాలో అత్యంత వాంటెడ్ వ్యక్తులైన ఇవాన్ మోర్డిస్కో, జైమ్ మార్టినెజ్ వీరి ఇరువురి నెట్‌వర్క్ వల్లే ఈ ఘటన జరిగిందని చెప్పారు. ఈ ఘటనను కొలంబియా అధ్యక్షుడు గుస్తావో ప్రెటో ఖండించారు.

# మన్ కీ బాత్ కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించాలి



గుంటూరు రూరల్(జర్నలిస్ట్ ఫైల్) : ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన్ కీ బాత్ – మనసులో మాట' 133వ ఎపిసోడ్‌ను గుంటూరు రూరల్ మండలంలోని అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేద్కర్ విద్యార్థులతో కలిసి వీక్షించారు.

కార్యక్రమం అనంతరం చెరుకూరు తిరుపతిరావు మాట్లాడుతూ, మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించడం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం, దేశభక్తి, ప్రకృతి పట్ల సానుకూల భావన పెంపొందుతాయని అన్నారు. దేశ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో ముఖ్యమని, ఇటువంటి కార్యక్రమాలు వారికి మంచి మార్గదర్శకత్వం అందిస్తాయని తెలిపారు.

డాక్టర్ దారా అంబేద్కర్ మాట్లాడుతూ, మన్ కీ బాత్ కార్యక్రమంపై విద్యార్థులకు త్వరలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి దేశవ్యాప్తంగా ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పార్లమెంట్, రాష్ట్రపతి భవన్‌లను ఉచితంగా సందర్శించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఇది విద్యార్థుల్లో జాతీయ అవగాహన పెంపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా గుంటూరు జిల్లా ఇన్‌చార్జి ఎనుముల నాగేశ్వరరావు, కంతేటి బ్రహ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కోలికపూడి మల్లికార్జునరావు, జిల్లా కార్యదర్శి కర్లపూడి రవి, జోనల్ ఇన్‌చార్జి మేకల లక్ష్మణ్, గుంటూరు జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి గట్టుపల్లి అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

# మానవత ఉచిత టైలరింగ్ శిక్షణ ఘనంగా ప్రారంభం




ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) : మహిళల ఆర్థిక స్వావలంబనకు నైపుణ్య శిక్షణే ఉత్తమ మార్గమని ప్రొఫెసర్ డాక్టర్ ఎం. ఎస్. చైతన్య కుమారి అన్నారు. మానవతా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ఆదివారం మానవత స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమైంది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ యం. ఎస్. చైతన్య కుమారి మాట్లాడుతూ, మారుతున్న సమాజ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధిక డిమాండ్ ఉన్న టైలరింగ్ రంగంలో మహిళలు నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. వినియోగదారులకు నమ్మకమైన సేవలు అందించడం ద్వారా మంచి పేరు సంపాదించవచ్చని తెలిపారు.

మరో ముఖ్య అతిథి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ, నేటి ప్రపంచంలో నైపుణ్యం కలిగిన వ్యక్తులకే ఎక్కువ అవకాశాలు లభిస్తున్నాయని, మానవతా సంస్థ అందిస్తున్న ఈ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేర్చుకున్న నైపుణ్యాన్ని సాధన చేస్తూ మరింత మెరుగుపరుచుకోవాలని కోరారు. సామాజిక సేవా సంస్థలను కలుపుతూ "కనెక్ట్" కార్యక్రమం ద్వారా మరింత సేవ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

మానవత సంస్థ చైర్మన్ పావులూరు రమేష్ సంస్థ నిర్వహిస్తున్న వివిధ సేవలను వివరించారు. ప్రెసిడెంట్ కోట శ్రీనివాసరావు మహిళలు ఈ శిక్షణను తప్పక నేర్చుకుని తమ జీవితాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.

సంస్థ సెక్రటరీ కే. సతీష్ మాట్లాడుతూ, ఈ ఉచిత టైలరింగ్ శిక్షణ 90 రోజులపాటు కొనసాగుతుందని, ప్రతిరోజు రెండు గంటల శిక్షణలో ఒక గంట సిద్ధాంత బోధన, కటింగ్ డెమో మరియు మరో గంట ప్రాక్టికల్ శిక్షణ ఉంటుందని తెలిపారు. ప్రతి వారం పరీక్షలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేస్తామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌తో పాటు మార్కెటింగ్, బ్యాంకు లోన్ సౌకర్యాలపై మార్గదర్శకత కూడా అందిస్తామని వివరించారు.

టైలరింగ్ శిక్షకురాలు కే. రామసేత మాట్లాడుతూ, నేటి మహిళలకు అవసరమైన అన్ని రకాల కుట్టు నైపుణ్యాలను ఉచితంగా నేర్పిస్తున్నామని తెలిపారు.

కార్యక్రమంలో ప్రముఖ అతిథులను ఘనంగా సత్కరించారు. అనంతరం శిక్షణ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ట్రెజరర్ టి. సాయిరాం వందన సమర్పణ చేశారు.

ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ డైరెక్టర్లు బాలకృష్ణ చౌదరి, మిత్ర, సూర్యదేవర కృష్ణ ప్రసాద్, తిరుపతి రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కల్పన, జాయింట్ సెక్రటరీ ఆనంద్, శివాజీ, కే. ఉమామహేశ్వరరావు, మేనేజర్ రాధాకృష్ణ, అలా అనంతరామయ్య, మోహన్ రావు గారు జాయిన్ జాయ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ గారు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కైలాసనాథ్, సాగర్, రాంబాబు గారు తదితరులు పాల్గొన్నారు.

# ఫిరాయింపుదారులపై అనర్హత వేటు

న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : పార్టీ ఫిరాయింపులకు పాల్పడి బిజెపిలో చేరిన ఏడుగురు రాజ్యసభ ఎంపిలను అనర్హులుగా ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాజ్యసభ ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్‌కు ఆప్ సీనియర్ నేత సంజరు సింగ్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంపిల చర్యలు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ఎంపిల ఫిరాయింపులు ప్రజాతీర్పునకు ద్రోహం చేయడమే కాకుండా రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ముఖ్యంగా ఫిరాయింపులకు పాల్పడిన వారిలో ఆరుగురు పంజాబ్ నుంచి ఆప్ టిక్కెట్టుపై ఎన్నికయ్యారని తెలిపారు. ఇప్పుడు పార్టీ ఫిరాయించి బిజెపిలో చేరడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు వారి సభ్యత్వాన్ని రద్దు చేయాల్సిందిగా రాజ్యసభ ఛైర్మన్‌ను కోరినట్లు తెలిపారు.

# అసాధారణ పట్టుదలతో ఎవరెస్ట్ శిఖరాన్ని ముద్దాడిన ప్రత్యేక ప్రతిభావంతులు

- అంగవైకల్యాన్ని జయించి.. ఎవరెస్ట్ ను అధిరోహించిన తెలుగు తేజాలు
- విజయవంతంగా 21 మంది దివ్యాంగ విద్యార్థుల ఎవరెస్ట్ శిఖరారోహణ!
- దివ్యాంగుల బృందంతో ట్రెక్కింగ్.. ప్రపంచంలోనే తొలిసారి
- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
- అభినందించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్
- హర్షం వ్యక్తం చేసిన విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు




అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : "సరిగ్గా నడవలేడు, వినపడదు.. ఈ అబ్బాయి కొండలు ఎక్కుతాడా?" లేదా "ఇంత కష్టమైన పని నీకెందుకు, ఇంట్లో కూర్చోవచ్చు కదా" వెటకారపు మాటలు.. " దినసరి కూలీల బిడ్డలు.. తిండికే కష్టమైన పరిస్థితుల్లో మీకు ఈ సాహసయాత్రలు ఎందుకు?" అనే ప్రశ్నలు."పెద్ద పెద్ద వాళ్ళకే సాధ్యం కానిది, ఈ పేద పిల్లలు ఏం చేస్తారు?" అనే చిన్నచూపు ఇవన్నీ ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించిన 21 మంది దివ్యాంగ చిన్నారులకు సమాజం నుండి ఎదురైన చేదు అనుభవాలు, అవమానాలు, వెటకారాలు. కానీ వారిలో ఉన్న కసి 'ఎవరెస్ట్' కంటే ఎత్తయినది. ఆ శిఖరాగ్రాన వారు ఎగిరేసిన విజయ పతాకమే తమను తక్కువ చేసిన మాటలకు ఇచ్చిన గట్టి సమాధానం. ఈ రోజు వారు బేస్ క్యాంప్ మీద నిలబడి చూస్తుంటే, ఆ అవమానాలన్నీ చాలా చిన్నవిగా కనిపిస్తున్నాయి. ఆ అవమానాలే వారికి ఇంధనాలు అయ్యాయి. ఆ అవమానాలే లేకపోతే, ఇంతటి గొప్ప విజయం సాధించాలనే పట్టుదల వారిలో ఉండేది కాదేమో!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 21 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, నేపాల్‌లోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌పై విజయకేతనం ఎగురవేసి, ప్రపంచానికి ఒక కొత్త పాఠాన్ని నేర్పారు.

**దేశంలో తొలిసారి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం :** ప్రత్యేక ప్రతిభావంతులకు ఏపీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ప్రపంచంలోనే మొదటిసారిగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల బృందం నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్రను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల బృందం నేపాల్ ఎవరెస్ట్ శిఖర అధిరోహణ యాత్ర చేపట్టడం ప్రపంచంలో ఇదే తొలిసారి. 21 మంది విద్యార్థుల బృందం ఏప్రిల్ 15న నేపాల్ రాజధాని ఖాట్మండూకు చేరుకున్నారు. ఏప్రిల్ 15 నుండి 16 రోజుల పాటు ఈ సాహసయాత్ర చేసింది.. 5,364 మీటర్ల ఎత్తులోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ను ప్రభుత్వ విద్యాసంస్థల్లో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు అధిరోహించారు. వీరిలో 8 మంది బాలికలు, 13 మంది బాలురు ఉన్నారు. వీరితో పాటు అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ పర్వతారోహకులు షేక్ హిమాన్షు, మలావత్ పూర్ణ, సమగ్ర శిక్ష స్పోర్ట్స్ విభాగం నుండి కె. శంకరయ్య పాల్గొన్నారు.

**మంత్రి నారా లోకేష్ ప్రోత్సాహం :** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ సాహస యాత్రను వారి క్యాంప్ ఆఫీసు నుండి స్వయంగా ప్రారంభించి, విద్యార్థులలో స్థైర్యాన్ని నింపారు. "మీలో ఉన్న పట్టుదలే మిమ్మల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది" అని ఆయన ఇచ్చిన పిలుపు విద్యార్థులకు కొండంత అండగా నిలిచింది.

**అండగా నిలిచిన సమగ్రశిక్ష :** సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు , పర్యవేక్షణలో ఈ విద్యార్థులకు గండికోట అడ్వెంచర్ అకాడమీలో, లద్దాఖ్‌లో కఠినమైన శిక్షణ అందించారు. ప్రభుత్వం తరఫున ఈ యాత్రకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చూసుకున్నారు.

**కఠిన శిక్షణ.. అలుపెరుగని పట్టుదల:** ఈ విద్యార్థులకు గండికోట అడ్వెంచర్ అకాడమీలో తొలి అడుగులు నేర్పారు. అక్కడి నుంచి లద్దాఖ్‌లోని మైనస్ 5 డిగ్రీల గడ్డకట్టే చలిలో విద్యార్థులు కఠిన శిక్షణ పొందారు. గండికోటలో 45 రోజులు, లద్దాఖ్ లో 15 రోజులు శిక్షణలో కొండలను అధిరోహించడంలో వేగాన్ని పెంచుకున్నారు.

ఈ విజయం కేవలం ఆ 21 మంది విద్యార్థులది మాత్రమే కాదు, సమాజంలో వివక్షను ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరికీ ఇది ఒక గొప్ప స్ఫూర్తి. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సరైన వేదిక కల్పిస్తే వారు ఆకాశమే హద్దుగా రాణిస్తారని ఈ 'నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ యాత్ర' నిరూపించింది.

**రేపటి తరానికి మీరు 'రోల్ మోడల్స్' :** ప్రపంచ చరిత్రలోనే తొలిసారిగా మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 21 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు నేపాల్‌లోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించడం నాకు గర్వకారణంగా ఉంది. సాధారణంగా వైకల్యాన్ని అడ్డంకిగా భావించే లోకానికి, మీ ఆత్మవిశ్వాసం ఒక గొప్ప సమాధానం. 5,364 మీటర్ల (17,598 అడుగులు) ఎత్తులో ఉండే ఆ మంచు శిఖరాలను మీరు అధిరోహించడం అంటే కేవలం ఒక కొండను ఎక్కడం మాత్రమే కాదు, మీపై ఉన్న అపనమ్మకాలను, అవమానాలను అధిగమించి శిఖర సమానమైన ఎత్తుకు ఎదగడం. ప్రతి ఏటా ఇలాంటి వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రత్యేక ప్రతిభావంతులను గుర్తించి, వారిని ప్రోత్సహించాలనేది మా ప్రభుత్వ లక్ష్యం. మీ వెనుక ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుంది. మీరు కేవలం విద్యార్థులు మాత్రమే కాదు, రేపటి తరానికి మీరు 'రోల్ మోడల్స్'. మీరందరూ సురక్షితంగా, విజయవంతంగా సాహసయాత్రను పూర్తి చేసి వస్తున్నందుకు హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

**తల్లిదండ్రుల హర్షం :** ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన ఈ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల విజయం చూసి ఉద్వేగానికి లోనయ్యారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం తమ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపిందని, వారిలో సొంతంగా బతకగలమనే ధైర్యాన్ని నింపిందని వారు కృతజ్ఞతలు తెలిపారు.

**విద్యార్థుల బృందం**

1. కాలగట్ల శివ లక్ష్మి (9వ తరగతి, వినికిడి లోపం, కర్నూలు)
2. ఎస్. డి. రిహానా (9వ తరగతి, వినికిడి లోపం, కర్నూలు)
3. బోడిరెడ్డి సింధు (ఇంటర్ 2వ సంవత్సరం, వినికిడి లోపం, తిరుపతి)
4. నీలకంఠి మధు తనూజ (9వ తరగతి, వినికిడి లోపం, నంద్యాల)
5. దూదేకుల అభిధ యశ్విన్ (9వ తరగతి, లోకోమోటర్ వైకల్యం, నంద్యాల)
6. బండి స్వాతి (9వ తరగతి, దృష్టి లోపం, నంద్యాల)
7. ఎర్రమాల కీర్తన (8వ తరగతి, లోకోమోటర్ వైకల్యం, నంద్యాల)
8. పితాని రూప సాయి శ్రీ (9వ తరగతి, వినికిడి లోపం, కాకినాడ)
9. చల్లా పవన్ కుమార్ (10వ తరగతి, లోకోమోటర్ వైకల్యం, అనకాపల్లి)
10. లెక్కల హరి శ్రీ దుర్గా ప్రసాద్ (10వ తరగతి, వినికిడి లోపం, విశాఖపట్నం)
11. పాసల ప్రసాద్ (10వ తరగతి, మేధో వైకల్యం, శ్రీ సత్యసాయి జిల్లా)
12. పత్తికొండ పునీత్ సాయి (10వ తరగతి, వినికిడి లోపం, తిరుపతి)
13. వెలుగు జ్ఞాన సాయి (9వ తరగతి, లోకోమోటర్ వైకల్యం, శ్రీకాకుళం)
14. యర్లబోయిన వెంకీ (10వ తరగతి, వినికిడి లోపం, వైఎస్ఆర్ కడప)
15. బుడిద మణికంఠ (ఇంటర్ 1వ సంవత్సరం, లోకోమోటర్ వైకల్యం, శ్రీకాకుళం)
16. అంబటి తెలుగు దేవేంద్ర (10వ తరగతి, వినికిడి లోపం, నంద్యాల)
17. తలారి మధు మనోజ్ (10వ తరగతి, లోకోమోటర్ వైకల్యం, నంద్యాల)
18. దూదేకుల మౌలాలి (10వ తరగతి, లోకోమోటర్ వైకల్యం, నంద్యాల)
19. గట్టెం విశ్వాస్ (10వ తరగతి, దృష్టి లోపం, విజయవాడ)
20. బెల్లపు దిలీప్ కుమార్ (ఇంటర్ 1వ సంవత్సరం, మేధో వైకల్యం, అన్నమయ్య జిల్లా)
21. అన్నంనేడి దైవ వెంకట సత్యనారాయణ (10వ తరగతి, వినికిడి లోపం, పశ్చిమ గోదావరి)

# ఫ్యాన్ పార్క్‌తో కిక్కిరిసిన మంగళగిరి

- యువతలో ఉత్సాహం ఉరకలు
- క్రికెట్ పండుగలా మారిన నగరం




మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్): టాటా ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ ఆదివారం రెండవ రోజు కూడా మంగళగిరిలో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా కొనసాగింది. మంత్రి నారా లోకేష్ చొరవతో టిడ్కో మెగా పార్క్‌లో ఏర్పాటు చేసిన ఈ ఫ్యాన్ పార్క్‌కు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. రెండో రోజున కూడా వేలాది మంది క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులతో తరలి వచ్చి కార్యక్రమాన్ని వీక్షించారు. భారీ ఎల్‌ఈడి తెరలపై ప్రత్యక్ష ప్రసారం అవుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లను ఆస్వాదిస్తూ అభిమానులు స్టేడియం తరహా అనుభూతిని పొందుతున్నారు. ప్రతి బౌండరీ, సిక్స్, వికెట్‌కు ప్రేక్షకుల నుంచి వచ్చే హర్షధ్వానాలు, కేరింతలు ఫ్యాన్ పార్క్‌ను నిజమైన క్రికెట్ స్టేడియంలా మార్చేశాయి. మ్యాచ్‌ల ఉత్కంఠకు అనుగుణంగా అభిమానుల స్పందన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మెట్రోపాలిటన్ నగరాలకు మాత్రమే పరిమితమయ్యే ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రత్యక్ష వీక్షణ అనుభవాన్ని మంగళగిరిలో ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు అపార ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా హైదరాబాద్, చెన్నై, ముంబై వంటి పెద్ద నగరాల్లో మాత్రమే లభించే ఈ అనుభూతిని తమ స్వస్థలంలోనే పొందడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న వినోద అవకాశాల అంతరాన్ని తగ్గించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతుండగా, యువతలో ప్రత్యేక ఉత్సాహం కనిపించింది. స్నేహితులతో కలిసి మ్యాచ్‌లను వీక్షిస్తూ యువత సందడిగా గడిపింది. సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటూ సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ వేడుక వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చింది. చిన్నారులు, మహిళలు సైతం పెద్ద ఎత్తున పాల్గొనడం ఈ కార్యక్రమం కుటుంబాలకు అనుకూలంగా మారినట్టు సూచిస్తోంది. ప్రేక్షకుల సౌకర్యం దృష్ట్యా నిర్వాహకులు పలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తగిన పార్కింగ్ సదుపాయం, త్రాగునీరు, కూర్చునే ఏర్పాట్లు కల్పించడంతో ప్రజలు సౌకర్యవంతంగా కార్యక్రమాన్ని ఆస్వాదించారు. ఫుడ్ స్టాల్స్‌లో వివిధ రకాల వంటకాలు, పానీయాలు అందుబాటులో ఉండటంతో సందర్శకులు సంతృప్తి వ్యక్తం చేశారు. అదనంగా, వినోద కార్యక్రమాలు, సంగీతం వంటి అంశాలు ఫ్యాన్ పార్క్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. భద్రతా పరంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణ, జనసందోహ నియంత్రణతో పాటు పార్క్ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించారు. ఉచిత ప్రవేశం కల్పించడం ఈ కార్యక్రమానికి ప్రజల రాకను మరింత పెంచింది. రెండు రోజుల పాటు మంగళగిరి నగరం క్రికెట్ పండుగను తలపిస్తూ సందడిగా మారింది. ఐపీఎల్ మ్యాచ్‌లను పెద్ద తెరపై వీక్షించే అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకున్న అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించే దిశగా మంత్రి నారా లోకేష్ తీసుకున్న ఈ కార్యక్రమం విశేష ప్రజాదరణ పొందుతోంది. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఫ్యాన్ పార్క్ ద్వారా క్రీడల పట్ల ఆసక్తి పెరగడంతో పాటు, సామూహికంగా క్రీడలను ఆస్వాదించే సంస్కృతి మరింత బలపడుతుందని ప్రజలు, క్రీడా అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# వైభవంగా శ్రీవాసవీమాత జయంతోత్సవం

- మే3న, సర్వసభ్యసమావేశం



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) : ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను ఆర్యవైశ్యప్రముఖుల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు.

స్థానిక బోస్ రోడ్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం, శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ సత్రం కమిటీ ఎన్నికలు వాయిదా పడిన క్రమంలో, ఇరువర్గాలు బాహాబాహి అనుకున్నా,వాసవీమాత సేవను సమిష్టిగా చేయాలనే సంకల్పంతో, ఇరు వర్గాల వారు ఉత్సవంలో పాల్గొన్నారు. సత్రం కమిటి తాత్కాలిక చైర్మన్ మునగాల శ్యామ్ వాసవి మాత జెండాను, గాలిగోపురం నుండి, అమ్మవారి గర్భాలయం వరకు, వేదమంత్రాలతో, జై వాసవి నినాదాలతో సంఘీయులతో కలిసి, ప్రదక్షిణ చేసి, అనంతరం ధ్వజస్థంబం వద్ద ప్రతిష్టించారు. ఈ సమయంలో, రెండు వర్గాలుఉన్న, ఆర్యవైశ్యుల మధ్య, మాటల తూటాలు పేలడంతొ, ఇంచార్జ్ మునగాల శ్యామ్ పోలీసుల నాశ్రయిస్తా మనడంతొ, బందోబస్తులో ఉన్న ఒన్ టౌన్ సి ఐ మల్లిఖార్జున రావు కలుగ జేసుకుని ఇరువర్గాల వారి, దూకుడుకు బ్రేకులు వేసారు. ఈసందర్భంగా మునగాల శ్యామ్ మాట్లాడుతూ వాసవి మాత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న,నేటి రోజున సత్రం కమిటీ ఎన్నికలు జరగాల్సి ఉందని, కొన్ని కారణాలతో వాయిదా పడిందని అన్నారు. ఈ విధానానికి స్వస్తి చెబుతూ, మే నెల 3వ, తేదీ ఆదివారం, సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు.,ఆరోజున మరల ఎన్నికలకు తేదీ ఖరారు చేయడం జరుగుతుందన్నారు. సర్వసభ్య సమావేశం జరిగిన రోజు నుండి, 15 రోజుల వ్యవధిలో సక్రమంగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా అందరూ సహకరించాలన్నారు. ఆరోజున తీసుకునే నిర్ణయాలకు, విభేదాలు మరిచి అందరూ సహకరించాలన్నారు. అందరు సహకరిస్తేనె, నూతన కమిటీ ఏర్పడుతుందన్నారు.

అనంతరం అమ్మవారికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఇదిలా ఉండగా పెండేల వెంకట్రావ్ ప్యానల్ సభ్యులు తమ అభిప్రాయాన్ని మీడియాకు వివరించారు. ఇప్పటి వరకు చోటు చేసుకున్న ప్రతీ అంశంలొ, గత కమిటీ ఒంటెద్దు పోకడ చూసామని, మే 3న, సర్వసభ్యసమావేశం అని ప్రకటించారు. సంతోషమే అయినా సక్రమంగా అమలు చేస్తారా అని ప్రశ్నించారు. సద్బుద్ధితొ సమావేశం నిర్వహించాలని, సకాలంలో ఎన్నికలు జరిగేల, అందరికీ ఆమోదమైన వ్యక్తులకు, ఎన్నికల ప్రక్రియ నిర్వాహణకు ప్రకటించేలా చూస్తామన్నారు. తాత శ్రీను మాట్లాడుతు ఎన్నికల ప్రక్రియ మొదలైన తరువాత, ఎటువంటి దురాలోచన చేసినా, అటువంటి వారి జీవిత కాలసభ్యత్వాన్ని రద్దు చేయాలనే భావన వ్యక్తం చేశారు. అనంతరం సాయంత్రం అమ్మవారి శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో నంబూరు వెంకటకృష్ణమూర్తి, పెండేల వెంకట్రావు, తాత శ్రీను, దేసు శ్రీనివాసరావు, ఉప్పల వరదరాజులు, మాలేపాటి హరిప్రసాద్, భాస్కరుని శ్రీనివాసరావు, మద్దాళి శేషాచలం, గుండా పిచ్చయ్య,ఇరు వర్గాల ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# అమెరికా డబుల్ గేమ్



టెహ్రాన్ : అమెరికా, ఇజ్రాయిల్ డబుల్‌గేమ్ ఆడుతున్నాయనే చర్చ నడుస్తోంది. ఓ వైపు శాంతి చర్చలంటూ దౌత్యం నడుపుతూ.. మరోవైపు అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకల్ని మోహరింపజేస్తోంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించినా... ఇజ్రాయిల్ వైమానిక దాడులతో జనావాసాలపై విరుచుకుపడుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో శాంతి చర్చలపై అనిశ్చితి నెలకొన్నదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక కామెంట్స్ చేశారు. అమెరికా విధిస్తున్న ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం, బెదిరింపుల నడుమ ఆ దేశంతో చర్చలు అసాధ్యమని తేల్చి చెప్పారు. శనివారం పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన శాంతి చర్చలపై ఇరాన్ వైఖరిని స్పష్టం చేశారు. ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోదని, అలాగే ఒత్తిళ్లకు తలొగ్గి ఒప్పందాలు చేసుకోబోదని పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఉద్రిక్తతలకు అమెరికానే కారణమని పెజెష్కియాన్ పేర్కొన్నారు. అమెరికా అనుసరిస్తున్న చర్యలే చర్చలకు ప్రధాన అడ్డంకి ఆయన పాక్ ప్రధానితో చెప్పినట్లు 'ప్రెస్ టీవీ' నివేదించింది. ఏప్రిల్ 13 నుంచి ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకాదళం దిగ్బంధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం వల్ల ఇరాన్ ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇలాంటి దిగ్బంధనాల నడుమ పరస్పర నమ్మకాన్ని పునరుద్ధరించడం అసాధ్యమని పేజెష్కియాన్ వెల్లడించారు. అందుకే ఇరు దేశాల మధ్య చర్చలు జరగాలంటే ముందుగా అమెరికా ఆంక్షలను తొలగించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**అడ్డంకిగా అమెరికా మొండిపట్టు :** ఇరాన్ – అమెరికా మధ్య చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరినా, కొన్ని విషయాలు ఒప్పందానికి అడ్డంకిగా మారాయని తెలుస్తోంది. ముఖ్యంగా 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధిని నిలిపివేయాలన్న అమెరికా డిమాండ్‌ను ఇరాన్ అంగీకరించాల్సిందేనని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఇదే అంశంపై విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయకూడదన్నదే తమ ఏకైక లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు.

**ఒమన్ నుంచి పాకిస్తాన్‌కు ఇరాన్ విదేశాంగమంత్రి :** ఇస్లామాబాద్ నుంచి వెళ్లిపోయిన తర్వాత ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఇప్పటికే తాము ఒక ఫ్రేమ్ వర్క్‌ను పాకిస్తాన్‌కు అందించామని తెలిపారు. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు ఇది ఒక మంచి మార్గమని ఆయన చెప్పారు. శాంతి చర్చలపై అమెరికాకు నిజంగా ఆసక్తి ఉందా? అన్నది అనుమానమేనని అన్నారు. ఒమన్‌లో జరిపిన దౌత్యపరమైన కార్యక్రమాల అనంతరం ఆదివారం సాయంత్రం ఇస్లామాబాద్‌కు తిరిగి వచ్చారని ఇరాన్ ప్రభుత్వ ప్రసార సంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ (ఐఆర్‌ఐబి) తెలిపింది. ఒమన్‌లో ఒకరోజు పర్యటన అనంతరం అరాఘ్చి రెండు రోజుల్లో పాకిస్తాన్ రాజధానిలో అరాఘ్చి పర్యటించడం ఇది రెండోసారి. పాకిస్తాన్‌లో తన సంక్షిప్త పర్యటనను ముగించుకుని ఆయన మాస్కోకు వెళ్తారని భావిస్తున్నారు. ఒమన్ నుంచి ఇస్లామాబాద్ శివార్లలోని పాకిస్తాన్ నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్నారు. రష్యాకు బయలుదేరే ముందు.. ఇక్కడకు వచ్చినట్టు సమాచారం. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ప్రతినిధుల ఇస్లామాబాద్ పర్యటనను రద్దు చేసినప్పటికీ, అమెరికా – ఇరాన్ శాంతి చర్చలను కొనసాగించే దౌత్య ప్రయత్నాలలో భాగంగానే అరఘ్చీ పాకిస్తాన్‌కు తిరిగి వచ్చారని ప్రచారం జరుగుతోంది.

ఒత్తిడి, బెదిరింపు, స్వాధీనాల నడుమ ఒప్పందం ఎలా సాధ్యపడుతుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రశ్నించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో జరిపిన టెలిఫోన్ సంభాషణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారని ఇరాన్‌కు చెందిన మెహర్ వార్తా సంస్థ తెలిపింది.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం - మేయర్ మహంకాళి స్వామి



**రామ్ మందిర్ ఏరియా, ఏప్రిల్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం ప్రజల సమస్యలను సమీపంలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వార్డు బాట పట్టినట్లు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. శనివారం వార్డు సందర్శనలో భాగంగా 2వ డివిజన్, జంఘాలపల్లి, న్యూ పోరట్‌పల్లి ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ వెంగళ బాపుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎన్‌టీపీసీ నాలా కారణంగా ప్రతి వర్షాకాలంలో ఈ ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయని అన్నారు. దశాబ్దాలుగా నాలాలో పూడిక తొలగించకపోవడంతో స్వల్ప వర్షానికే ఇళ్లలోకి నీరు చేరుతున్నదని తెలిపారు. ఎన్‌టీపీసీ అధికారులతో మాట్లాడగా నాలా పూడిక తొలగింపుకు అంగీకరించారని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈసారి వరద ప్రభావం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎస్‌టీ కాలనీలో వంతెన నిర్మాణం కోసం కూడా ఎన్‌టీపీసీ అధికారులను కోరినట్లు తెలిపారు. రెండో డివిజన్‌లో కొన్ని ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ అవసరం ఉన్నట్లు గుర్తించామని, త్వరలో నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు. విద్యుత్ సమస్యలపై స్పందిస్తూ, సింగిల్ ఫేజ్ సరఫరాతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారని, వెంటనే త్రీ ఫేజ్ సరఫరా కల్పించాలని ఎన్‌పీడీసీఎల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసి, మిడిల్ పోల్స్ ఏర్పాటు చేస్తామని, వంగిపోయిన, శిథిలమైన స్తంభాలను తొలగించాలనే సూచనలు ఇచ్చామని తెలిపారు. పైప్‌లైన్లు ఉన్నప్పటికీ నల్లా కనెక్షన్లకు దరఖాస్తు చేయని వారిని గుర్తించామని, మున్సిపల్ సిబ్బంది ద్వారా అవగాహన కల్పించి కనెక్షన్లు కల్పిస్తామని చెప్పారు. నగరాన్ని శుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు కాలువలు, రోడ్లపై చెత్త వేయకుండా సహకరించాలని కోరారు. రోడ్లు, కాలువలపై ఆక్రమణలు చేయవద్దని సూచించారు. మేయర్ ఆదేశాల మేరకు మెప్మా, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. పలు వీధుల్లో రోడ్లపైకి వంగి ఉన్న చెట్లు, కొమ్మలను తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో సిబ్బంది, అధికారులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెరుగు భూలక్ష్మి, నగర పాలక సంస్థ ఎస్.ఈ. గురువీర, ఈ.ఈ. పి.వి. రామన్, టీపీఎస్ నవీన్, డీఈఈ జగదీష్, షాభాజ్, ఏఈ జమీల్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, నాయకులు దాసరి విజయ్, వెంగళ పద్మలత, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా వ్యాధిని అరికట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత పిలుపు



**మార్కాపురం, (జర్నలిస్ట్ ఫైల్) :** శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భం గా స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం నుండి కంభం సెంటర్ వరకు వైద్యఆరోగ్య శాఖ సిబ్బందితో నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ మలేరియావ్యాధి అరి కట్టడానికి 2008 సంవత్సరం నుండి ప్రపంచ మలేరియా దినముగాప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించ డానికి ఈసంవత్సరం మలేరియా అంతం మన పంతం అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించ డానికి ర్యాలీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె చెప్పారు. మలేరియా వ్యాధిచాలా ప్రాణాం తకమైన వ్యాధని వ్యాధిబారిన పడ కుండా దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అని ఆమె చెప్పారు. గ్రామాల్లో మరియు పట్టణ ప్రాంతాల్లో నీరు నిల్వలులేకుండా పరిసరాలను పరిశుభ్ర తగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. మార్కాపురం జిల్లాలో 60 వేల మందికి మలేరియా పరీక్షలు చేపట్టడం జరిగిందని ఎవ్వరికి కూడా పాజిటివ్ రాలేదని ఆమె చెప్పారు. అనంతరం ఖమ్మం సెంటర్ లో వైద్యఆరో గ్యశాఖ అధికారు లతో సిబ్బందితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.బి.మనష్ ,జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ రాహుల్, డాక్టర్ శ్రావణి ,డాక్టర్ అనూష డాక్టర్ చేతన్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గీత వృత్తిలో మృతి చెందిన గీత కార్మికుడి కుటుంబానికి (కన)వారి ఆర్థిక సహకారం అందజేత



**రాజన్న సిరిసిల్ల** జిల్లా తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు సాయిలి కిషన్ గౌడ్ ఇటీవల వృత్తి చేస్తూ ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై మోకు జారడంతో తాటి చెట్టు పైనే అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. అట్టి గీత కార్మికుడి పైనే కుటుంబం ఆధారపడి ఉన్నందున అతని కుటుంబానికి సహకారంఅందించవలసిందిగా గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర కోఆర్డినేటర్ ములుగురి యాకయ్య గౌడ్, కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ బాధ్యులను కోరడం జరిగింది. వారు మనం చేసిన విజ్ఞప్తిని మన్నించి అట్టి కుటుంబానికి (కన) తరపున 30,000 రూపాయలు కిరాణా షాప్‌ను ఆర్థిక సహకారాన్ని అందించుటకు గాను సంస్థ స్థానిక ప్రతినిధి నాతి గణేష్‌అన్న, బాల్నే రామచందర్ గౌడ్ చెప్పడం జరిగింది. వారు అట్టి డబ్బులను కుటుంబానికి అందించవలసిందిగా (మోకుదెబ్బ) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ గుల్లపెల్లి వెంకటేష్ గౌడ్ కి చెప్పడంతో మృతుని కుటుంబం ఇంటికి వెళ్లి 30,000 రూపాయల కిరాణా షాప్‌కు ఆర్థిక సహకారాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా యాకన్నా గౌడ్ మాట్లాడుతూ చేతివృత్తులలోనే అత్యంత ప్రమాదకరమైన వృత్తి కల్లుగీత వృత్తి అని ఇట్టి వృత్తిలో ప్రమాదం అని తెలిసిన గీత కార్మికులు గత్యంతరం లేని పరిస్థితులలో తమ కుటుంబ పోషణ కోసం వృత్తిని కొనసాగిస్తున్నారని కల్లుగీత వృత్తిలో ఇటీవల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చాలామంది గీత కార్మికులు మరణించడం,పూర్తి అంగవైకల్యం పొందడం జరుగుతుందని ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ప్రతి గీత కార్మికుడికి సేఫ్టీ మోకులు అందించాలని. వృత్తి రక్షణకై చర్యలు చేపట్టాలని.గీత కార్మికులకు ఐదు లక్షలు ఉన్న ఎక్స్‌గ్రేషియాను 10 లక్షలకు పెంచి బాధిత కుటుంబాలను తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహకారాన్ని అందించాలని కోరారు. మృతి చెందిన గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహకారం అందించిన కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థకు(మోకుదెబ్బ) రాష్ట్ర కమిటీ మరియు జిల్లా కమిటీ తరపున గ్రామ గౌడ సంఘం సొసైటీ తరపున, కుటుంబ సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కోఆర్డినేటర్ సుదగని శ్రీలత గౌడ్ యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల వీరస్వామి గౌడ్ జిల్లెల్ల గ్రామ సర్పంచ్ దుబ్బాక రజిత-రమేష్, ఉప సర్పంచ్ మొగిలి కర్ణాకర్ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు బొల్గాం రాములు గౌడ్ ఉపాధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ స్థానికులు సాయిలు భాను గౌడ్ సతీష్ గౌడ్ శేఖర్ గౌడ్ తంగళ్ళపల్లి మండల ప్రధాన కార్యదర్శి కందుకూరి పరుశు రాం గౌడ్ బాలసాని గుండయ్య గౌడ్ బాల ఎల్లయ్య గౌడ్ ఉప్పునూతల వెంకటేష్ గౌడ్ జిల్లెల్ల గ్రామం జిల్లాల గ్రామం గౌడ యూత్ అధ్యక్షులు తాళ్లపల్లి రాజు గౌడ్ సాయిల్ సతీష్ గౌడ్ భానుచందర్ గౌడ్ శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల ప్రగతిలో గురువుల పాత్ర అమోఘం



**-క్రమశిక్షణే ఆభరణం - విజయమే గమ్యం**
**-స్వేరో జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో**
**-గురుకుల విద్యార్థులకు స్వేరో నెట్వర్క్ ఘన వీడ్కోలు**
**-సెలవుల్లోనూ 'లక్ష్యం' వీడొద్దు**

**ఖమ్మం, ఏప్రిల్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :**



గురుకులాల ప్రగతిలో గురువుల పాత్ర అమోఘం అని, ఖమ్మం జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో విద్యా సంవత్సరాన్ని అత్యంత క్రమశిక్షణతో, ఉత్తమ ఫలితాలతో పూర్తి చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులకు స్వేరో జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో శనివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో మాట్లాడుతూ.. విద్యార్థులను కేవలం పాఠాలకే పరిమితం చేయకుండా, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్న జోనల్ ఆఫీసర్ అలివేలు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు, అహర్నిశలు శ్రమిస్తున్న ఉపాధ్యాయ బృందానికి, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణలో వారు చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. సెలవుల్లోనూ 'లక్ష్యం' వీడొద్దు : వేసవి సెలవుల కోసం ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే కొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవాలని స్వేరో నెట్వర్క్ ఆకాంక్షిస్తుందన్నారు. సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేసేలా సముచిత మార్గదర్శకత్వం అందించాలని కోరారు. కొత్త లక్ష్యాలతో, రెట్టింపు ఉత్సాహంతో తదుపరి విద్యా సంవత్సరానికి సిద్ధం కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వేరో జిల్లా కమిటీ తరువున విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.

## ఆత్మగౌరవ జీవనమే ప్రభుత్వ లక్ష్యం.





**ఆందోల్‌లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం**
**పేదల సొంతింటి కల సాకారం**
**అర్హులందరికీ దశల వారీగా ఇళ్లు**
**మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**ఆందోల్, ఏప్రిల్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రేగోడు మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాన్ని ప్రారంభించారు. లబ్ధిదారుడు మహేష్ కుటుంబ సభ్యులతో కలిసి గృహ ప్రవేశంలో పాల్గొని వారి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదలు సొంతింటిలో ఆత్మగౌరవంతో జీవించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ పథకం ద్వారా ఇల్లు లేని పేదల కలను నెరవేర్చుతున్నామని పేర్కొన్నారు. దశల వారీగా ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి వారికి గృహ వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. సొంత ఇంటి ద్వారా కుటుంబాలకు భద్రత, గౌరవం కలుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షుడు మున్నూరు కిషన్, డాక్టర్స్ సెల్ చైర్మన్ డా. రాజీవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దిగంబర్ రావు, భాస్కర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సంగమేశ్వర్, సర్పంచ్ పర్విన్ చోటు మియా, పిర్యా నాయక్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి పథకాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని అధికారులు తెలిపారు. పేదలకు గృహ వసతి కల్పించడం ద్వారా సమాజంలో సమానత్వాన్ని సాధించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

## అధికారిక పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి



**తాండూర్, ఏప్రిల్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :** జనగణన 2027లో భాగంగా భారత ప్రభుత్వం ప్రజలకు సులభంగా ఉండే విధంగా 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' విధానాన్ని తీసుకువచ్చినట్లు తాండూర్ తహసీల్దార్ జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ ఈనెల 26 నుంచి నుండి వచ్చే నెల 10వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన అధికారిక పోర్టల్ ద్వారా పౌరులు స్వయంగా రిజిస్టర్ అయి, తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలు నమోదు చేసుకున్న ప్రతి వ్యక్తికి ఒక ఎస్ఈ ఐడీ జనరేట్ అవుతుందని తదుపరి జనగణనలో భాగంగా మీ ఇంటికి ఎన్యూమరేటర్ వచ్చినప్పుడు ఈ ఎస్ఈ ఐడీని తెలిపితే సరిపోతుందన్నారు. వారు ఆ వివరాలను చెక్ చేసి సబ్మిట్ చేస్తారని ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశం తప్పులు లేకుండా, తొందరగా జనగణన వివరాలను సులభంగా సేకరించడమే అని వివరించారు. మండలంలోని గ్రామాల్లో ప్రజలు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. దీని వల్ల ఎన్యూమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు సమయం ఆదా అవుతుందని, డేటా కూడా కచ్చితంగా ఉంటుందని తెలిపారు.

## పరిశుభ్రత పాటిస్తేనే మలేరియాకు అడ్డుకట్ట



**- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**

**మలేరియా వంటి వ్యాధులను నివారించాలంటే పరిసరాల పరిశుభ్రత కీలకమని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని జర్నలిస్ట్‌ఫైల్**గుమ్మడిదలలో డాక్టర్ ఎస్. మధుకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని తెలిపారు. ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. సర్ రోనాల్డ్‌రాస్ సేవలను స్మరించుకుంటూ గ్రామాల్లో ప్రతి శుక్రవారం పారిశుద్ధ్యకార్యక్రమాలునిర్వహించాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పరమేశ్వర్ కౌన్సిలర్లు రాజేష్ రాజారెడ్డి రమేష్ శేఖర్‌రెడ్డి కృష్ణ నాయకులు పుట్టా నర్సింగ్ రావు మైపాల్ రెడ్డి హుస్సేన్ అంజనేయులు శ్రీనివాస్ రెడ్డి , భాస్కర్ రెడ్డి డాక్టర్ నిహారిక హెచ్ఈఓ శ్రీనివాస్ ఎంఎల్హెచ్‌పీలు కళ్యాణి భాగ్య ఏఎన్ఎంలు,ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల దందాపై ఉక్కుపాదం... డీలర్లను హెచ్చరించిన పోలీస్ వ్యవసాయం అధికారులు



**బెల్లంపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** నకిలీ, అనధికార విత్తనాల విక్రయంపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ వ్యవసాయ అధికారులు హెచ్చరించారు. బెల్లంపల్లి పరిధిలోని శ్రేయస్ బంక్వెట్ హాల్‌లో వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖలు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విత్తనాలు అమ్మొద్దంటూ లైసెన్స్ డీలర్ల ను హెచ్చరించారు. వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్‌కుమార్ నకిలీ విత్తనాలను గుర్తించే విధానాలను వివరించగా, ఏడీ అగ్రికల్చర్ రాజానరేందర్ నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చెన్నూర్ ఏడీఏ బానోత్ ప్రసాద్ గ్లైఫోసేట్, పారాక్వాట్ వంటి మందులు వాడకూడదని సూచించారు. బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ నకిలీ విత్తనాల నియంత్రణలో డీలర్ల సహకారం కీలకమని పేర్కొనగా, డీసీపీ మంచిర్యాల భాస్కర్ అనుమతి లేని విత్తనాలఅమ్మకం,కొనుగోలు,రవాణాపైకఠినచర్యలు తీసుకుంటామని, కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, డీలర్లు పాల్గొన్నారు.

## ప్రజల సేవే మా లక్ష్యం.. వ్యక్తిగత విమర్శలు మానండి



**-సీజీఆర్ కార్యాలయం జనతా గ్యారేజ్-**
**పార్టీలకు అతీతంగా 24 గంటల సేవలు**
**-కాంగ్రెస్ నాయకులపై గోవర్ధన్ రెడ్డి ఘాటు విమర్శలు**
**-అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచన**

**జర్నలిస్ట్ ఫైల్** పటాన్చెరువు నియోజకవర్గ రాజకీయం అంటే ప్రజల కోసం పని చేయడమే అని, వ్యక్తిగత విమర్శలు చేయడం సరైంది కాదని బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్ రెడ్డి తెలిపారు. సీజీఆర్ కార్యాలయం సాధారణ కార్యాలయం కాదని, ప్రజల సమస్యలకు వెంటనే స్పందించే జనతా గ్యారేజ్ అని చెప్పారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల తీరుపై స్పందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి కలిసి మాట్లాడారు. గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఏ సమస్య వచ్చినా సీజీఆర్ కార్యాలయంలోనే పరిష్కారం లభిస్తుందని, పార్టీలతో సంబంధం లేకుండా 24 గంటలు అందుబాటులో ఉంటామని తెలిపారు. రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలోఅధికారంలో ఉన్నప్పటికీ పఠాన్‌చెరులో ప్రజలు వారిని నమ్మలేదని, ఐదు మున్సిపాలిటీల్లో గులాబీ పార్టీ నాయకులనే గెలిపించారని పేర్కొన్నారు. గుమ్మడిదల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ప్రజల్లో ఉండి పని చేస్తేనే విశ్వాసం వస్తుందని చెప్పారు. గతంలో కాటా శ్రీనివాస్ గౌడ్ సర్పంచ్‌గా ఉన్నప్పుడు సస్పెండ్ అయిన విషయాన్ని గుర్తు చేస్తూ, తాము అలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని తెలిపారు. పదవీకాలం పూర్తి చేసి మళ్లీ ప్రజల మద్దతుతో గెలుస్తున్నామని చెప్పారు. పఠాన్‌చెరులో ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రజలకు అండగా ఉన్నారని, గుమ్మడిదలలో సీజీఆర్ నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. జీఎంఆర్ తమకు పెద్దన్న లాంటివారని చెప్పారు. ఓటమి, విజయం ప్రజల తీర్పు అని, అవసరం లేని రాజకీయాలు మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. ప్రజల సేవే తమ లక్ష్యమని, రాజకీయాల పేరుతో వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజశేఖర్, సంజీవరెడ్డి, కిషన్, సర్పంచ్ కొమ్ము శ్రీను, ఉప సర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, వెంకట్రాంరెడ్డి, పొన్నాలశ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి ,జయపాల్ రెడ్డి,గోపాల్,బక్క సత్యనారాయణ, చిరుమని శ్రీనివాస్, సాయి రెడ్డి,భాస్కర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రవి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ




**బెల్లంపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :**తీవ్ర ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు అఖిల భారత మార్వాడీ యువ మంచ్ బెల్లంపల్లి నగర శాఖ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. 31 రోజుల పాటు పట్టణంలోని 31 కేంద్రాల్లో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం అంబేద్కర్ కాంటా చౌరస్తాలోని హనుమాన్ ఆగ్రోస్ దుకాణం ముందు కార్యక్రమాన్ని ప్రారంభించి సుమారు 1,150 గ్లాసుల మజ్జిగను పంపిణీ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు చల్లదనం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యువ మంచ్ అధ్యక్షుడు కృష్ణకాంత్ సోని మాట్లాడుతూ, కార్యక్రమానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బాలు మారు, కమల్ లహోటి, అరవింద్ అగర్వాల్, రాజేందర్ లహోటి, అజయ్ లహోటి, దినేష్ సారడా తదితరులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేసిన కానాల



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 333 వ ఆరాధన గురుపూజ మహోత్సవాలు పురస్కరించుకొని మఠానికి విచ్చేసిన భక్తుల దాహార్తి తీర్చేందుకు పదివేల వాటర్ ప్యాకెట్లు పదివేల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కాణాల మల్లికార్జున రెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీపీ వీర నారాయణ రెడ్డి టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ఉపాధ్యక్షులు శీలం నరసింహ గౌడ్ మేకల సుధాకర్ చలమల నాగయ్య పూజా శివ యాదవ్ రామ సుబ్బారెడ్డి అధికారులు ఎంపీడీవో రామచంద్రారెడ్డి మరియు డిఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## షుగర్ వ్యాధి నియంత్రణకు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): షుగర్ వ్యాధి బాధితులు వ్యాధిని అదుపులో ఉంచుకునేందుకు, కేవలం మందులపై ఆధార పడకుండా, ఆహారపు అవవాట్లను మార్చుకుని, శరీర వ్యాయామం,దినసరి నడక, ఓ కార్యాచరణతో, కొనసాగించడం, ద్వారా వ్యాధిని అదుపులో ఉంచుకుని సుఖమయ జీవనం సాగించవచ్చని, డాక్టర్ శారద వ్యాధి గ్రస్తులకు ఆరోగ్య సూచనలు చేశారు.

డి 3,శారదా సర్వీసెస్ సొసైటీ ద్వారా, ప్రతి నెల చివరి ఆదివారం షుగర్ వ్యాధి బాధితులకు, ఉచిత వైద్యపరీక్షలు, నెల సరి మందులు ఉచితంగా అందజేస్తున్న క్రమంలో, ఆదివారం బుర్రిపాలెం రోడ్ లోని, డాక్టర్ ఎస్ బిల్డింగ్ లో, డి3,శారదా సర్వీసెస్ సొసైటీ ద్వారా 230మందికి, రెండు సార్లు రక్త పరీక్షలు చేసి,షుగర్ లెవల్స్ ను బట్టి, నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు.

ఆరుగంటలకు రక్త పరీక్ష చేసిన వారికి, అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం రెండవ విడత రక్త పరీక్షలు చేశారు. తెనాలి పరిసర గ్రామాల నుండి వచ్చిన షుగర్ బాధితులకు, డాక్టర్ శారద, వ్యాధి నియంత్రణకు, పలు సూచనలు చేశారు. సొసైటీ సిబ్బంది సహకరించారు.

# విశాఖలో గూగుల్ డేటా సెంటర్ గేమ్ ఛేంజర్

- డేటా సెంటర్ తో 1.88 లక్షల ఉద్యోగావకాశాలు
- నేడు విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు
- ఇది డిజిటల్ యుగానికి నాంది
- సీఎం చంద్రబాబు విజనరీకి నిదర్శనం
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): విశాఖలో ఈ నెల 28న శంకుస్థాపన జరగనున్న గూగుల్ డేటా సెంటర్ గేమ్ ఛేంజర్ గా మారబోతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలకు స్వర్గధామంగా మారిందని చెప్పారు. ఇప్పటికే లక్షల కోట్ల రూపాయలతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు బడా కంపెనీలు క్యూ కట్టాయంటే సీఎం చంద్రబాబు నాయుడుపై నమ్మకం, అనుభవమే కారణమని తెలిపారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా 1.88 లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఉద్యోగాల వేటలో యువతకు దొరికిన గమ్యస్థానం విశాఖ అని తెలిపారు. ఇప్పుడు విశాఖ తీరంలో మరో స్వర్ణ యుగం రాబోతోందని, రాబోయే భవిష్యత్తు మొత్తం ఏఐతో ముడిపడి ఉందని అన్నారు. గూగుల్ డేటా సెంటర్ తో కేవలం సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు మాత్రమే కాదు.. డేటా సైంటిస్టులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) నిపుణులు, విద్యుత్, నెట్ వర్కింగ్ వ్యవస్థల నిర్వహణకు అవసరమైన హార్డ్ వేర్ నిపుణులూ ఇలా ఎన్నో ఉద్యోగాలు రాబోతున్నాయి. డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ప్రకటించాక రిలయన్స్, బ్రూక్ఫెల్డ్ సంస్థలు కూడా విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చాయని చెప్పారు. భవిష్యత్తులో ఐటీ, ఏఐ, క్లౌడ్, సెమీకండక్టర్ కంపెనీలు అనేకం విశాఖకు క్యూ కట్టేందుకు గూగుల్ డేటా సెంటర్ దోహదం కాబోతోందన్నారు. 2019కి ముందే టీడీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలో రూ. 70 వేల కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటుకు అదానీ సంస్థ సిద్ధమైందని గుర్తు చేశారు. 2019లో కాపులుప్పాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం నీరుగార్చిందని తెలిపారు. గత ఐదేళ్ల జగన్ పాలనతో రాష్ట్రం నుంచి అనేక పరిశ్రమలు తరలిపోయాయని, ఇది జగన్ విధ్వంసానికి నిదర్శనమని చెప్పారు. మళ్లీ రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని, పిల్లల భవిష్యత్తుకు దారులు పడ్డాయని అన్నారు.

## ఔటర్ రింగ్ రోడ్ కోసం అవసరానికి మించి భూసేకరణను అడ్డుకుంటాం

- రైతుకు అండగా ఉంటాం
- అఖిలభారత కిసాన్ సభ అధ్యక్షులు డాక్టర్ అశోక్ ధావలె



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి రాజధాని పరదిలో అవసరానికి మించి ప్రభుత్వం బలవంతపు భూసేకరణను చేస్తోందని అఖిలభారత కిసాన్ సభ అధ్యక్షులు డాక్టర్ అశోక్ థావలే అన్నారు. ఈవిధమైన భూసేకరణను కచ్చితంగా అడ్డుకుంటామని, కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న ప్రధాని మోడీ కి,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వంతపాడుతున్నారన్నారనీ ఆరోపించారు.

మండలంలోని గుడివాడ గ్రామంలో ఔటర్ రింగ్ రోడ్ ద్వారా భూములు కోల్పోతున్న రైతులతో ఆదివారం జాతీయ కిసాన్ సభ నాయకులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా .జాతీయ స్థాయి నాయకులు తొలుత రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. భూ సేకరణకు మార్కింగ్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో జాతీయ అధ్యక్షులు అశోక్ థావలే మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదనలో కేవలం 70 మీటర్ల వెడల్పు అవసరమని ఉండగా, ప్రభుత్వం, భూసేకరణ విషయానికి వచ్చేసరికి 250 మీటర్ల వెడల్పుకు మార్కింగ్ చేసినట్లు చెప్పారు. పైగా ప్రభుత్వ ధర ప్రకారమే రైతుకు పరిహారం చెల్లించే విధంగా అధికారులు మాట్లాడుతున్నారని, ఈ పరిణామాలతో రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 22 మండలాలలో 121 గ్రామాల, పరిదిలో పదివేల ఎకరాల బలవంతపు భూసేకరణకు ప్రభుత్వం పాల్పడుతుందని, కేవలం గుడివాడ గ్రామంలోనే 201 ఎకరాల భూమిని రైతులు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. ఆల్ ఇండియా కిసాన్ మహాసభ, రైతు సంఘం రైతులకు అండగా నిలుస్తుందని, రైతులు సమిష్టి పోరాటానికి సిద్ధం కావాలన్నారు. గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం ముఖేష్ అంబానీకి కట్టబెట్టేందుకు సెజ్ పేరుతో 30 వేల ఎకరాల భూ సేకరణకు సిద్ధపడిందన్నారు. అయితే దీనిపై ఆల్ ఇండియా కిసాన్ మహాసభ, రైతు సంఘం 2007 నుంచి 2012 వరకు ఐదేళ్లపాటు సుదీర్ఘ పోరాటం చేసి, భూ సేకరణ ప్రక్రియను అడ్డుకున్నట్లు గుర్తుచేశారు. అమరావతి రాజధాని పరిధిలో కూడా ఆల్ ఇండియా కిసాన్ సభ, రైతు సంఘం బలవంతపు భూసేకరణను అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. అయితే అభివృద్ధికి వ్యతిరేకం కాదని కేవలం అవసరానికి మించి భూసేకరణను మాత్రమే అడ్డుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జె. అజయ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెట్టి బాలరాజు ఈమని అప్పారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె బాబు ప్రసాద్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## చిన్నారుల మధ్య 'కందుల' సందడి..



- ప్రొటోకాల్ పక్కనపెట్టి చిచ్చరపిడుగులతో మంత్రి దుర్గేష్ సరదా ముచ్చట్లు, ఫోటోలు!

నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) : రాజకీయ విమర్శలు, అధికారిక సమీక్షలు, ప్రజా సంక్షేమ పథకాలతో నిత్యం బిజీగా ఉండే పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం సరికొత్త అవతారంలో కనిపించారు. నిడదవోలులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌కు హాజరైన ఆయనను చూసి చిన్నారులు కేరింతలు కొట్టారు. సాధారణంగా మంత్రుల చుట్టూ ఉండే సెక్యూరిటీ, ప్రొటోకాల్ హడావిడిని చూసి పిల్లలు వెనకడుగు వేస్తుంటారు. కానీ, ఇక్కడ సీన్ రివర్స్ అయ్యింది! మంత్రి దుర్గేష్ ని చూడగానే ఆత్మీయంగా చుట్టుముట్టిన చిన్నారులు, ఆయనతో షేక్ హ్యాండ్స్ ఇస్తూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. చిన్నారుల ఉత్సాహాన్ని చూసి మంత్రి తన హోదాను పక్కనపెట్టి వారితో మమేకమయ్యారు. నిత్యం రాజకీయ ఒత్తిడిలో ఉండే నాయకులకు ఇలాంటి క్షణాలు సరికొత్త శక్తిని ఇస్తాయని ఈ సందర్భంగా ఆయన చిరునవ్వుతో వ్యాఖ్యానించారు. ప్రతి చిన్నారి కోరికను మన్నిస్తూ, వారందరితో ఓపిగ్గా ఫోటోలకు పోజులిచ్చారు.

"మా మంత్రి గారు మమ్మల్ని కలిశారు!" అంటూ ఆ చిచ్చరపిడుగులు వ్యక్తం చేసిన ఆనందం అక్కడ ఉన్న అతిథులందరినీ ఆకట్టుకుంది. నిడదవోలులో జరిగిన ఈ ఆత్మీయ కలయిక, ఒక నాయకుడు ప్రజలకు (ముఖ్యంగా భావి భారత పౌరులకు) ఎంత చేరువగా ఉండవచ్చో మరోసారి నిరూపించింది.

## సీఎంకు 'బిజినెస్ రిఫార్మర్' అవార్డు రావడం పట్ల చిలకలపూడి పాపారావు హర్షం

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్' అవార్డు రావడం పట్ల ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు విజన్, పారిశ్రామికాభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధతకు ఈ పురస్కారం దక్కిన గౌరవమని ఆయన కొనియాడారు.

?ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంలో సీఎం చేస్తున్న కృషికి ఈ అవార్డు ఒక గుర్తింపు అని పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ఐటి హబ్‌గా మార్చిన ఘనత ఆయనదేనని, ఇప్పుడు నవ్యాంధ్రను కూడా అదే బాటలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. పారిశ్రామిక సంస్కరణల వల్ల రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయని, తద్వారా లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఇటువంటి పురస్కారం లభించడం వల్ల ఆంధ్రప్రదేశ్ గౌరవం మరింత పెరిగిందని, దేశవ్యాప్తంగా పారిశ్రామికవేత్తల చూపు ఏపీ వైపు మళ్లుతుందని అభిప్రాయపడ్డారు. ఈ అవార్డు రావడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణం అని, చిలకలపూడి పాపారావు సీఎంకు అభినందనలు తెలియజేశారు.

# పావులూరి హనుమంతరావు జన్మదిన సందర్భంగా అన్నదానం



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ) ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మరియు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ప్రియ శిష్యులు పావులూరి హనుమంతరావు జన్మదిన వేడుకల సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురు పూజ మహోత్సవాలలో వైశాఖ శుద్ధ దశమి నాడు వివిధ ప్రాంతాలలో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా పావులూరి హనుమంతరావు మాట్లాడుతూ నా పూర్వజన్మ సుకృత ఫలముగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు సజీవ సమాధి నిష్ఠ వహించిన వైశాఖ శుద్ధ దశమి నాడు నా పుట్టినరోజు రావడం నాకు చాలా ఆనందదాయకంగా ఉందని నేను రాష్ట్రవ్యాప్తంగా మా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తూ సమాజ సేవలో ఉన్నానని నాడు నా జన్మదినం సందర్భంగా అనేక ప్రాంతాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇది నాకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దివ్య ఆశీస్సుల వల్లనే లభించిందని ఆయన తెలిపారు.

# డీజిల్‌పై ఆందోళన అవసరం లేదు

- వదంతులు వ్యాప్తి చేసే వారిపట్ల చర్యలు
- వదంతులు నమ్మవద్దని జెసి ప్రజలకు విజ్ఞప్తి



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ స్పష్టం చేశారు. జిల్లాలో డీజిల్ కొరతపై వస్తున్న వదంతులపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు అవసరమైన మేరకు ఇంధన సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో డీజిల్ కొరతపై వస్తున్న ప్రచారం నేపథ్యంలో ప్రజలు భయాందోళనలకు లోనవుతూ పెట్రోల్ బంకుల వద్ద అధిక సంఖ్యలో చేరుతున్నారని పేర్కొన్నారు. అవసరం లేకపోయినా డీజిల్‌ను నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించడం వల్ల అనవసర రద్దీ ఏర్పడుతోందని చెప్పారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా, సాధారణ అవసరాలకు మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించారు. పెట్రోల్ బంకుల్లో సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. ఇంధన కొరతపై వస్తున్న వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 195 బంకులు ఉండగా 12 బంకులలో పెట్రోలు స్టాక్, 70 బంకులలో డిజిల్ స్టాక్ కొరత ఉందని, మిగిలిన బంకులలో ఎలాంటి ఇబ్బంది లేదని వివరించారు. వదంతులు నమ్మి ప్రజలు అధికంగా కొనుగోలు చేయడం కారణంగా బంకులలో కొంతమేర కొరత ఏర్పడిందని, ఆదివారం అయినప్పటికీ పెట్రోల్ కంపెనీల వారితో మాట్లాడి, సదరు బంకులలో ఆదివారం లేదా సోమవారం ఉదయం లోగా పూర్తి స్థాయిలో డీజిల్ అందుబాటులో ఉండేలాగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొండపల్లి స్టాక్ పాయింట్ నుండి ఐ.ఓ.సి.ఎల్, బి.పి.సి.ఎల్ బంక్ లకు ఆదివారం కారణంగా సరఫరా కాకపోవడం ఒక కారణం అన్నారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యలు ఉంటే ఆయిల్ కంపెనీ వారిని సంప్రదించి స్టాక్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొంత మంది క్యానులు, డ్రమ్ములలో డీజిల్ కొనుగోలు చేస్తున్నారని, అటువంటి వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. కార్ల యజమానులు సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న అవాస్తవాలతో ఆందోళన చెంది ట్యాంక్ ఫుల్ చేయించుకుంటున్నారని చెప్పారు. జిల్లాలో సరాసరిన 450 కిలో లీటర్ల విక్రయాలు ఉండగా, శనివారం ఒక్కరోజు ఏడు వందల కిలో లీటర్ల విక్రయాలు జరిగాయని తెలిపారు. శనివారం 810 కిలో లీటర్ల డీజిల్ సరఫరా చేశారని చెప్పారు. ఇంధన కంపెనీలతో ప్రతి రోజూ రెండు సార్లు సంప్రదిస్తున్నామని, ప్రతి బంక్ వద్ద ఒక ఉద్యోగిని నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. ఎలక్ట్రికల్ వాహనాల రీఛార్జింగ్ కు అధికంగా మొత్తాలను వసూలు చేస్తే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో 50 వేల ఎల్.పి.జి సిలిండర్ల డెలివరీ పెండింగ్ లో ఉందని, కొద్ది రోజులలో సరఫరా చేస్తామని చెప్పారు.

**అవాస్తవాలు వ్యాపింప చేసే వారిపై కేసులు నమోదు**

జిల్లాలో పెట్రోలు, డీజిలు కొరత ఏర్పడనున్నదని అవాస్తవాలను సోషల్ మీడియా ద్వారా వ్యాపింపజేసి, ప్రజలను ఆందోళనకు గురి చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాపై నిఘా పెట్టామని చెప్పారు.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు:** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ చెప్పారు. డీజిల్, పెట్రోల్ కొరతపై సమాచారం ఉంటే కంట్రోల్ రూమ్ ఫోన్ - 7780675354 కు తెలియజేయవచ్చని అన్నారు.

## క్రీడలను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం : ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



- బాల్ బ్యాట్మెంటన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన చీఫ్ విప్ జీవి..

వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ): కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తూ పెద్ద పీట వేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు.

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ– పల్నాడు జిల్లా, ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారి సహకారంతో వినుకొండ NSP హైస్కూల్లో బాలికల బ్యాడ్మింటన్ రెసిడెన్షియల్ వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ఏర్పాటు చేయగా ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా జీవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, ఉద్యోగాల్లో క్రీడాకారుల కోట రిజర్వేషన్ను 2% నుండి 3% కూటమి ప్రభుత్వం పెంచిందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో క్రీడలను నిర్లక్ష్యం చేశారని, ఆడుదాం ఆంధ్ర పేరుతో కోట్ల రూపాయలు దోపిడీ చేసి క్రీడారంగాన్ని దోచుకున్నారన్నారు. ఓటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడలతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని, వినుకొండ నుండి క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి వినుకొండ ఖ్యాతిని చాటాలన్నారు. అంతర్జాతీయ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచాలని కోరారు.

క్రీడాకారులకు శివశక్తి ఫౌండేషన్ ద్వారా తన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. స్పోర్ట్స్ కొటాలో ఉద్యోగం సాధించిన కోటేశ్వరి ని చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎండల తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి




ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) : ఎండల తీవ్రత పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని, జిల్లాలోను 45 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల, జిల్లా కార్యాలయాల్లోనూ చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని అన్నారు. జనకూడలి ప్రదేశాల్లోనూ, ఇతర అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రియాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు టోపి, తలపాగా వంటివి ధరించాలన్నారు. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, కళ్ళ రక్షణ కోసం నాణ్యమైన సన్ గ్లాసెస్ ఉపయోగించాలన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగవద్దని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు.

**వడ దెబ్బపై ప్రజల్లో అవగాహన అవసరం**

వడ దెబ్బపై ప్రజల్లో అవగాహన అవసరమని, ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. వడ దెబ్బకు గురి కాకూడదని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాలని చెప్పారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పనులు ఉంటే మినహా ఎవరు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పనులకు బయటకు వస్తే గొడుగు ఉపయోగించాలని, వదులు దుస్తులు ధరించాలని, తగినంత నీటిని తాగాలని సూచించారు. చిన్నారులు, వయసు మీరినవారు బయటకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు చూడాలని చెప్పారు. డీ హైడ్రేషన్ కు గురికాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**నీడను కల్పించాలి**

ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహన చోదకులు కొంత సేపు నిలువ వలసి ఉంటుందని, వారికి నీడను కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ వేతనదారులు, భవన నిర్మాణ కార్మికులు తీవ్రమైన ఎండలో పని చేయకుండా తగిన పర్యవేక్షణ చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ, కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని, మజ్జిగ వంటి ఏర్పాట్లు చేయుటకు చర్యలు తీసుకోవాలని కోరారు.

**తాగు నీటి ఎద్దడి తలెత్తరాదు**

తాగు నీటి ఎద్దడి ఏ గ్రామంలోను తలెత్తకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. జిల్లాలో తాగునీటి సమస్య ఏర్పడే గ్రామాలు గుర్తించాలని, అటువంటి గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోర్లను 24 గంటలలో మరమ్మతులు పూర్తి చేయుటకు అవసరమైన విడి పరికరాలు సిద్ధంగా పెట్టాలని ఆదేశించారు. పశువులకు, వీధి కుక్కలకు కూడా తాగునీటిని లభ్యంగా ఉంచాలని సూచించారు. తాగు నీటి నాణ్యత పరీక్షలు ప్రతీ రోజూ చేయాలని ఆదేశించారు. అతిసార తలెత్తకుండా మున్సిపల్ కమిషనర్ లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపు లైన్ల ద్వారా సరఫరా అవుతున్న తాగు నీరు ఎక్కడా కలుషితం కాకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగు నీటి పైపు లైన్లు మురుగు నీటి కాలువల గుండా వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, ధ్రువీకరించాలని అన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని, అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# అశేష భక్త జనులకు సింహాసనులై దర్శనమిచ్చిన మఠాధిపతులు



○ శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి

బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ) : జగద్గురు శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠం నందు శ్రీ స్వాములవారి 333వ ఆరాధన గురుపూజ మహోత్సవాల్లో భాగంగా ఈ రోజున వైశాఖ శుద్ధ దశమి పర్వదినాన శ్రీ స్వాములవారు సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర సుదినం. జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం 12 మఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారు సింహాసనాసీనులై అశేష భక్త జనావళికి దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు

# రండి... స్వీయ గణనలో పాల్గొనండి




○ ఇంకా నాలుగు రోజులే

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలు స్వీయ గణనలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ కోరారు.

జనాభా గణనపై ప్రజల్లో అవగాహనలో భాగంగా ఆదివారం "సెన్సస్ 5 కె రన్" ను జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి కమిషనర్ ప్రారంభించారు. "సెన్సస్ 5 కె రన్" హిందూ కాలేజీ కూడలి వరకు జరిగింది.

స్వీయ గణన నినాదాలతో రన్ పెద్ద ఎత్తున సాగింది. స్వీయ గణన సదుపాయంలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యమై వాస్తవ వివరాలు పొందుపరచుటకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 30వ తేదీ వం-కు స్వీయ గణన అందుబాటులో ఉంటుందన్నారు. స్వీయ గణన ద్వారా సమర్పించిన వివరాలను సంబంధిత ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు ధృవీకరిస్తారని స్పష్టం చేశారు. డిజిటల్ విధానంలో స్వీయ గణన చేసుకోవడం వలన మే ఒకటో తేదీ నుండి ఇంటింటికి జరిగే జనాభా లెక్కల సేకరణ సులభతరం అవుతుందని అన్నారు.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 2027 జనాభా గణన మొదటిసారిగా డిజిటల్ విధానంలో జరుగుతోందన్నారు.

ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 30వ తేదీ వరకు స్వీయ గణన చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. దేశాభివృద్ధిలో కీలకమైన ఈ జాతీయ కార్యక్రమంలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములు కావాలని, డిజిటల్ పద్ధతిలో తమ వివరాలను నమోదు చేసుకుని జనగణనను విజయవంతం చేయాలనీ విజ్ఞప్తి చేశారు. స్వీయ గణన ద్వారా వాస్తవ జనాభా గణన వస్తుందని, మే ఒకటో తేదీ నుండి మే నెలాఖరు వరకు జరిగే గణన వేగవంతంగా జరుగుతుందని అన్నారు. స్వీయ గణన ద్వారా సమర్పించిన వివరాలను సంబంధిత ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు ధృవీకరిస్తారని స్పష్టం చేశారు.

వలస వెళ్లిన వ్యక్తులు తమ శాశ్వత చిరునామా వద్దగాని ప్రస్తుతం ఉన్న చిరునామ వద్ద గాని జన గణన చేసుకోవచ్చని సూచించారు. జన గణన పట్ల ఎటువంటి అపోహలు అవసరం లేదని చెప్పారు. పీరియాడికల్ గా జరిగే ఒక కార్యక్రమాన్ని తద్వారా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకొనుటకు ఉపయోగపడుతుందని చెప్పారు. జన గణనలో ఓటీపీ కేవలం లాగిన్ కొరకు మాత్రమే అడగడం జరుగుతుందని బ్యాంకు గాని ఇతర సంబంధిత వివరాలు ఇందులో అడగడం జరగదని దీని పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఈ "సెన్సస్ 5 కె రన్" లో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి. హెచ్. కృష్ణ, పర్యాటక అధికారి రమ్య, జనాభా గణన ఇన్ ఛార్జ్ అధికారి ఆదిత్య లక్ష్మీ, కలెక్టర్ కార్యాలయ విభాగం పర్యవేక్షకులు మల్లీశ్వరి, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎడ్ల భాస్కర్ రావు, వివిధ శాఖల అధికారులు, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దానం అంటే మహోన్నత త్యాగమే



**చల్లపల్లి(జర్నలిస్ట్ ఫైల్) :** మానవత్వానికి ప్రతీకగా నిలిచే అవయవ దానం చేయడం మహోన్నత త్యాగంతో కూడుకున్నదని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు.

ఇటీవల అనారోగ్యంతో మరణించిన కెసిపి విశ్రాంత ఉద్యోగి కస్తూరి కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను ఆదివారం సురేష్ బాబు కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ మరణించిన తర్వాత శరీర భాగాలను ఇతరుల కోసం త్యాగం చేసి వారికి పునర్జన్మ ఇచ్చిన కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు నిర్ణయం అత్యున్నతమైన దాతృత్వ చర్య అని కొనియాడారు. ప్రియమైన కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధలో ఉన్న సమయంలో వారి అవయవాలను దానం చేయడానికి ముందుకు రావటం స్ఫూర్తిదాయకమన్నారు.

కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను స్ఫూర్తిగా తీసుకొని అవయవ దానం కొరకు చొరవ చూపి కుల, మత,వర్గ బేధాలు లేని ప్రాణాలు కాపాడే గొప్ప మానవీయ కార్యక్రమాల కొరకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సురేష్ బాబు ఆకాంక్షించారు.

కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను అభినందించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకొంటూ ఆయన చిత్ర పటానికి పులమాలలతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నేత మేడేపల్లి సుబ్బారావు, కృష్ణమూర్తి కుమారుడు ప్రముఖ రక్తదాత కస్తూరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నందివెలుగు కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రారంభం అభినందనీయం

○ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** రిజర్వు బ్యాంక్ నిబంధనలకు లోబడి,జాతీయ బ్యాంకులకు ధీటుగా మధ్యతరగతి ప్రజల ముంగిటకు, బ్యాంకింగ్ సేవలను తీసుకు వెళుతు, ఖాతాదార్ల మన్ననలు పొందుతున్న కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకులలో, నందివెలుగు కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఒకటని, నమ్మకమైన, బ్యాంకింగ్ సేవలతొ తెనాలిలొ తమ బ్రాంచ్ ఏర్పాటు చేసుకోవడం ముదావహమని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. గుంటూరు ప్రధాన కేంద్రంగా రాష్ట్ర వ్యాప్తంగా 6శాఖలున్న, నందివెలుగు కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటి లిమిటెడ్, తమ 7వ, శాఖను,స్థానిక కొత్తపేటలోని టిజె. కళాశాల సమీపాన, ఏర్పాటు చేయగా ఆదివారం ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, కాకినాడ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, భాష్యం రామకృష్ణ లు విశిష్ట అతిధులుగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతు కోఆపరేటివ్ సెక్టార్ ద్వారా, ఖాతా దారులకు, జాతీయ బ్యాంకులకు ధీటుగా బ్యాంకింగ్ సేవలు లభిస్తున్నాయన్నారు. ఆదిశగా సొసైటీ వ్యవస్థాపకులు తోట లక్ష్మీకోటేశ్వర్రావు, 6,బ్రాంచ్ లద్వారా మెరుగైన సేవలను ఖాతాదారులకు అందిస్తు, మరింత మెరుగైన లక్ష్యాలు సాధిస్తూ, తెనాలిలొ 7వ, బ్రాంచ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. తెనాలి ప్రాంత ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలను అందిస్తు, ఉన్నతిని సాధించాలని ఆకాంక్షించారు. రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతు 18వేల మంది ఖాతాదారులకు నమ్మకమైన సేవలను అందించిన లక్ష్మీ కోటెశ్వర్రావు తెనాలి బ్రాంచ్ ద్వారా, ఖాతాదారులను గణనీయంగా పెంచుకుంటు, మరిన్ని బ్రాంచ్ ల ద్వారా, తమ క్రెడిట్ సొసైటీ సేవలు విస్తృతం చేసుకోవాలని ఆకాంక్షించారు. సొసైటీ చైర్మన్ తోట లక్ష్మీ కోటేశ్వరరావు మాట్లాడు 2020లొ ప్రారంభమైన తమ సొసైటీ ఖాతాదారుల నమ్మకమే పెట్టుబడిగా రాష్ట్రంలొ, మంగళగిరి, విజయవాడ, గుంటూరు రెండు బ్రాంచ్ లతొపాటు, తెలంగాణ రాజధాని హైదరాబాద్ కు విస్తరించడం ద్వారా, 18వేల మంది ఖాతాదారులతొ ముందుకు సాగుతున్నామన్నారు. తెనాలి ప్రాంత వాసులు, నందివెలుగు కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సేవలను, రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు అనుగుంగా పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలొ సొసైటీ సి ఇఒ తేళ్ళ సుబ్బారావు, బ్రాంచ్ మేనేజర్ గూడూరు రామారావు, వర్ధమాన సినీ దర్శకులు ఎకె. జంపన్న, కరణ్ విజయ్, అనీష్ రామ్,స్థానిక ప్రముఖులు గుమ్మడి రమేష్, శాస్త్రి, గుమ్మడి రవీంద్ర, బసవపున్నయ్య, డాక్టర్ జె. కోటినాగయ్య, వీరవల్లి మురళీ, తదితరులు పాల్గొన్నారు.

# రెండవ రోజు విజయవంతమైన ఫ్యాప్టో నిరాహార దీక్ష

○ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉదృతం చేస్తాం: ఫ్యాప్టో హెచ్చరిక




**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) :** ఫ్యాప్టో మలిదశ పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించిన రెండో రోజు నిరాహార దీక్ష విజయవంతమైందని ఫ్యాప్టో రాష్ట్రచైర్మన్ ఎల్. సాయి శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్. చిరంజీవి తెలిపారు. ప్రభుత్వం తమ 17 డిమాండ్లపై తక్షణం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. దీక్షకు అధ్యక్షత వహించిన ఎల్. సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు, స్థానిక సంస్థల్లో కారుణ్య నియామకాలు, హైస్కూల్ ప్లస్‌ల బలోపేతం, పెండింగ్ డీఏలు విడుదల, సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపు వంటి అంశాలతో కూడిన 17 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ఎస్. చిరంజీవి మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాధాన్యతలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు లేరని విమర్శించారు. 12వ వేతన సవరణ కాలం ప్రారంభమై 33 నెలలు గడిచినా కనీసం వేతన సవరణ సంఘాన్ని కూడా నియమించకపోవడం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే ఇవ్వాల్సిన నాలుగు డీఏ కిస్తీలు పెండింగ్‌లో ఉంచడాన్ని తప్పుబట్టారు.

పంచాయతీరాజ్ యాజమాన్యంలో ప్రధానంగా రెండు సమస్యలు ఉన్నాయని, అవి ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు మరియు కారుణ్య నియామకాలేనని తెలిపారు. 2017లో రాష్ట్రపతి ఉత్తర్వులు తీసుకురావడం, 72, 73, 74 జీఓలను విడుదల చేయడం జరిగినప్పటికీ, 72, 73 జీఓల అమలులో అధికారులు ప్రభుత్వ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యలపై ఫ్యాప్టో ఎంతవరకైనా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం అన్యాయమని అన్నారు. ఈ నిరాహార దీక్షకు ప్రైవేట్ స్కూల్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు డి. ప్రసన్న సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర కో-చైర్మన్లు కె. నరహరి, కాకి ప్రకాశ్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ ఎన్. వెంకటేశ్వర్లు, కె. బసవలింగారావు, కార్యవర్గ సభ్యులు సి హెచ్. మంజుల, జి. హృదయరాజు, ఏ. రామారావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఏలూరు, గుంటూరు, ప్రకాశం, శ్రీ సత్యసాయి, కర్నూలు జిల్లాల నుంచి చైర్మన్లు, సెక్రటరీ జనరల్స్, ఉపాధ్యాయులు హాజరై సంఘీభావం ప్రకటించారు.

# యాదవ్ ఎంప్లాయిస్ సొసైటీ బలోపేతానికి కార్యాచరణ



**తాడేపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ యాదవ్ ఎంప్లాయిస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తాడేపల్లిలోని మారుతి ఎన్‌క్లేవ్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. సమీకరణ, సమన్వయం, సహకారం అనే మూడు ప్రధాన అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

రాష్ట్ర అధ్యక్షుడు డి. వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ, 2014లో నెల్లూరు జిల్లాలో ప్రారంభమైన యాదవ్ ఎంప్లాయిస్ సొసైటీ ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలకు విస్తరించిందన్నారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న యాదవ్ ఉద్యోగులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి పరస్పర సహకారం అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం బాధ్యులు డాక్టర్ బి. అప్పారావు, మండల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంస్థకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల పర్యటనలకు హాజరవుతామని చెప్పారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రమేష్ యాదవ్ గత కార్యక్రమాల నివేదికతో పాటు ఆర్థిక నివేదికను సమర్పించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ప్రతిభావంతులైన మరియు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు.

సమావేశంలో లింగమూర్తి యాదవ్‌ను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, గుంటూరుకు చెందిన గుండు బోయిన శ్రీనివాస్ యాదవ్‌ను జిల్లా అధ్యక్షుడిగా, పద్మ యాదవ్‌ను రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎంపిక చేశారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి వారాది వెంకటరమణను రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు.

రాష్ట్రంలో YES సంస్థను మరింత పటిష్టం చేయడం, కార్యవర్గ విస్తరణకు కొత్త నియామకాలు చేపట్టడం, ప్రతిభ కనబరిచిన యాదవ్ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి సన్మాన కార్యక్రమం నిర్వహించడం, జిల్లాల వారీగా శాఖల ఏర్పాటు వేగవంతం చేయడం వంటి కీలక తీర్మానాలు ఆమోదించారు.

రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. పుల్లయ్య యాదవ్, ముఖ్య నాయకులు రాఘవరావు, రజనీకాంత్, షణ్ముఖరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, నాగశేషు, రామకృష్ణ, తులసిరామ్, ఆదినారాయణ, కామేశ్వరరావు, భిక్షరావు, రమేష్, శీను తదితరులతో పాటు 20 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

# శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక గాంధీ చౌక్ లోని శ్రీవీరబ్రంహ్మేంద్ర స్వామిఆలయంలో స్వామి వారి 333 ఆరాధన ఉత్సవాల్లొ ఆధివారం ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు అభినందనలు తెలిపారు. ఉదయం నుండి ఆరాధన ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు.

ఆలయ ఇఒ హరిప్రసాద్, స్వామివారి శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు, అందజేశారు. కార్యక్రమంలో భాగంగా వేలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల నాగార్జున ,కృష్ణ ,తేజ, పెద్ద సంఖ్యలో విశ్వబ్రాహ్మణ సంఘియులు, స్థానికులు పాల్గొన్నారు .

# వైభవంగా వాసవి జయంతి ఉత్సవాలు



○ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కందుల దుర్గేష్

○ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల క్షేమమే లక్ష్యం - మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు, (జర్నలిస్ట్ ఫైల్) :** నిడదవోలులోని ప్రముఖ పుణ్యక్షేత్రం చిన్న కాశిరేవులో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ గారు అమ్మవారిని దర్శించుకుని పూలు, పండ్లు మరియు పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం లోక కల్యాణార్థం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన శోభాయమానమైన ఊరేగింపులో మంత్రి దుర్గేష్ స్వయంగా పాల్గొన్నారు. .రేగింపు పొడవునా కళాకారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. భక్తులతో కలిసి నడుస్తూ ఉత్సవాల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. "అమ్మవారి కటాక్షం రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నాను. మన రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, పర్యాటక మరియు సాంస్కృతిక రంగాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలవాలని అమ్మవారిని ప్రార్థించాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# 5కె రన్ ద్వారా జనగణనపై అవగాహన



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** దేశప్రగతికి దోహద పడే స్వశ్చంద జనగణనపై ప్రజల్లో అవగాహన పెంచడమే 5కె, రన్ లక్షమని తహాశీల్దార్ కెవి. గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ విభాగం ఆధ్వర్యంలొ జనగణనపై అవగాహన పెంచే దిశగా ఏర్పాటు చేసిన, 5కె, రన్ కార్యక్రమాన్ని, తహాశీల్దార్ కెవి. గోపాలకృష్ణ ముఖ్య అతధిగా పాల్గొని ప్రారంభించారు. జన గణనకు సహకరిద్దాం, దేశ ప్రగతికి తోడ్పడదాం అంటూ నిర్వహించిన 5కే రన్ కార్యక్రమం చూపర్లను విశేషంగా ఆకట్టుకుంది. జన గణన 2027 అవగాహన దిశగా. మున్సిపల్ కార్యాలయం నుండి ప్రారంభమైన 5కె రన్. కార్యక్రమాన్ని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు పర్యవేక్షించారు. ఎన్ సీ సి విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్న, 5కె, రన్,గాంధీ చౌక్ మీదుగా బోస్ రోడ్, వహబ్ రోడ్,కొత్త వంతన మీదుగా,మున్సిపల్ కార్యలయం వరకుకొనసాగింది. ఈక్రమంలొ విద్యార్థులు జనగణన చేద్దాం- ప్రగతిని నిర్మిద్దాం , మీ వివరాలే రేపటి ప్రణాళికలు. ,తప్పనిసరిగా లెక్కల్లో ఉందాం,సగర్వంగాముందుకు సాగుదాం, అంటూ నినాదాలు చేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీవాణి, జి ఎస్ డబ్ల్యూ మేనేజర్ శ్యామలాదేవి , ఆర్ ఓ రాంప్రసాద్ ,జె టి ఓ ప్రసాద్, ఎన్ సీ సీ అధ్యాపకులు బెల్లంకొండ వెంకట్, భాస్కర్, సానిటరీ ఇన్స్పెక్టర్ లు,మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జన్మజన్మల పుణ్యఫలం శ్రీవీరబ్రహ్మేంద్రుని దర్శన భాగ్యం

○ వైభవంగా 333వ ఆరాధన గురుపూజ మహోత్సవాలు

○ జై వీరబ్రహ్మ జై గోవిందమాంబ జై నామ స్మరణతో మారుమోగిన మఠం

○ బ్రహ్మంగారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



**బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్ ) :** తెలుగు రాష్ట్రాల నుండి కాక తమిళనాడు కర్ణాటక నుండి భారీగా తరలివచ్చిన భక్తులు సింహాసనం పై భక్తులకు దర్శనమిచ్చిన మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారు భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞాన సృష్టికర్త జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 333వ ఆరాధన గురుపూజ మహోత్సవాల వేడుకలు వైభవోపేతంగా కళాకాంతులతో భక్తుల భక్తి భావనల మధ్య అంగరంగ వైభవంగా జరుగుచున్నది ప్రాతఃకాలం నుండి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి సుప్రభాత నామ కీర్తన అభిషేక సహస్రనామార్చన కార్యక్రమాలతో మొదలై స్వామివారు సజీవ సమాధి నిష్ట వహించిన పవిత్ర సుదీనమైన వైశాఖ శుద్ధ దశమి ఆదివారము నాడు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దర్శన భాగ్యం కోసం బారులు తీరారు జై వీర బ్రహ్మ జై గోవిందమాంబ జై అనే నామస్మరణతో బ్రహ్మంగారి మఠం మొత్తము మారు మోగింది బ్రహ్మంగారి దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనం కోసం వచ్చారు

**దీక్షాబంధనాలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనం**

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు సజీవ సమాధి ఇష్ట వహించిన వైశాఖ శుద్ధ దశమి రోజున శ్రీ స్వామి వారు దీక్ష బంధనాలంకారంలో కొలువై భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు ఇందుకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి భక్తులు స్వామివారి మాలా దీక్ష ఆదరణ పొంది 32 రోజులు పాటు నిష్టాగరిష్టులై స్వామివారి నామార్చనతో ఎంతో నియమ నిబంధనలతో దీక్షను పొందిన భక్తులకు నేడు స్వామి వారు దీక్షాబంధన అలంకారంలో దర్శనమిచ్చారు

**సింహాసనాసీనులైన శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి వారు**

వైశాఖ శుద్ధ దశమి నాడు స్వామి వారు సజీవ సమాధినిష్ఠ వహించిన పవిత్ర దినము నాడు మఠాధిపతులు శ్రీ శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారు సింహాసనాసీనులై భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు మాలా దీక్షపరులకు స్వామివారు మాల విరమణ చేసి స్వామివారి ఆశీర్వచనములు కలిగేలా దీవించారు

**నేడే బ్రహ్మరథోత్సవం**

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురు పూజ మహోత్సవాల్లో భాగంగా నేడు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి బ్రహ్మరథోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించడం జరుగుతుంది భక్తులు స్వామివారి రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరు

**పటిష్టమైన పోలీస్ బందోబస్తీ**

ఆరాధన గురుపూజ మహోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మఠాధిపతులు శ్రీ వీరధర్మల వెంకటాద్రి స్వాముల వారి అనుమతులతో మఠం మేనేజర్ ఈశ్వరయ్య చారి ఆదేశాల మేరకు మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ సీఐ శివశంకర్ ఎస్సై శివప్రసాద్ ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో దర్శనం కలిగేలాగా చర్యలు చేపట్టారు

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467